# పెంపకపు మమకారం

ఫ్యాక్టరీ పనివాళ్ళ ప్రవాహం క్రమంగా క్షీణించిందీ అనేసరికి కొత్త వెల్లువ పొంగినట్టు కళాశాలలకూ, ఉన్నత పాఠశాలలకూ పోయే విద్యార్థినీ విద్యార్థులు మెయిన్‌రోడ్డును దఖలు పరిచేసుకున్నారు. మనం ఏ కూరల మార్కెట్‌నుంచో వస్తూ ఏమాత్రం పరధ్యానంగా ఉన్నా క్వీన్ మేరీస్ హైస్కూలు విద్యార్థినుల పెట్టెబండో, కాలేజీ విద్యార్థి సైకిలో, యూనివర్శిటీ విద్యార్థుల సిటీబస్సో నిర్దాక్షిణ్యంగా శిక్షించి తీరుతుంది. సందులూ గొందులలో కూడా మున్సిపాలిటీ వారి చెత్తబళ్ళనూ, లారీలనూ, నీళ్ళకావిళ్ళ వాళ్ళనూ చూసుకుంటూ నడవ్వలసిందే.

సుదర్శనం సురక్షితంగానే చేతిలో కూరల సంచీతో యిల్లు చేరుకున్నాడు. తొందరగా మెట్లెక్కి మూసి ఉన్న తలుపును తట్టే ఉద్దేశంతో తలుపుమీద చేయి వేయబోయాడు. ఇంతలోనే లోన తలుపు తీస్తున్న శబ్దం వినబడింది. కొంతసేపు ఆగి ఎంతకీ తలుపు తెరుచుకోకపోగా తనే తలుపు తోశాడు.

లోపలి దృశ్యం చూడగానే అడుగు ముందుకు వేయబోయిన వాడల్లా అలాగే నిలబడిపోయాడు.

ద్వారానికి రెండు మూడు గజాల దూరాన తల్లి పార్వతమ్మ, తెల్లగా తోమిన ఇత్తడి బిందెను ఆవలి అంచు పట్టుకొని కూతురి చేతిలోంచి ఒడుచుకుంటోంది. చెల్లెలు సరస్వతి యీవలి అంచు పట్టుకొని లాగులాడుతోంది. ఇద్దరి ముఖాలలోనూ మానవ లక్షణాలు చాలా సేపయి దూరమైనట్టున్నాయి. తలుపు చప్పుడు కాగానే ముఖాలను స్వస్థితికి తెచ్చుకోడానికి ప్రయత్నిస్తూ ఇద్దరూ ఒకేసారి చూశారు ద్వారం వంక. ఎదురుగా పాలిపోయిన ముఖంతో విభ్రాంత దృక్కులతో సుదర్శనం అగపడ్డాడు. క్షణకాలం ముగ్గురూ అలాగే ఉండిపోయారు. సరస్వతి సిగ్గుతో ముఖం తిప్పేసుకుంది. సుదర్శనం కూడా తెలివి తెచ్చుకొని లోనికి వచ్చి వెనుతిరిగి తలుపు వేస్తూ తల్లి వంక చూశాడు. పార్వతమ్మ గట్టిగా పలకబోయే స్వరాన్ని మునిపళ్ళ బలంతో అదిమి పెడుతూ అన్నారు.

"నువ్వు వద్దంటే వద్దు. నువ్వె నీళ్ళు తేవడానికి వల్లకాదు".

.... ఇలా అంటూనే ఒక్క గుంజుతో సరస్వతి చేతిలోని బిందె ఊడలాక్కొని పటాటోపంగా లోపలికి వెళ్ళిపోయారు. సరస్వతి నల్లగా మాడిన ముఖాన్ని గోడకు తిప్పేసుకుంది. పక్కనుంచి పోతూ ఏమో అనాలని ఆగిన సుదర్శనం చెల్లెలు ముఖంలోకి చూడగానే ఏమీ అనకుండానే నడవ దాటి లోపలికి వెళ్ళిపోయాడు. ద్వారం దగ్గర నిలబడి యీ దృశ్యాన్నంతా చూస్తున్న సుబ్బులు అన్న చేతిలో కూరల సంచీ అందుకుంది. సుబ్బులు వెనుక నిలుచున్న పెదతల్లి కూడా సుదర్శనానికి దారి యిస్తూ పక్కకి తప్పుకుంది.

సుదర్శనం తన గదిలోకి పోయి పుస్తకాలు సర్దుకుంటుండగా సుబ్బుల్ని పిలిచి జరిగినదేమిటో తెలుసుకోవాలనే ఉద్దేశం కలిగింది. కాని టేబిల్‌మీద వాచీ 'ఇంక పది నిమిషాలే వ్యవధి!' అనగా అతడే విషయమూ తెలుసుకోకుండానే కాలేజీకి వెళ్ళిపోయాడు.

## 2

సాయంత్రం అయిదు గంటలవుతుంది. సుదర్శనం అప్పుడే వచ్చాడు. సుబ్బులు ఇల్లు ఊడుస్తోంది. పెత్తల్లి నట్టింట కూర్చుని కళ్ళద్దాల్లోంచి నిదానంగా చూస్తూ గోవిందనామాలు పాడుకుంటోంది. పెరటి వాకిట్లో ఏ మూలనుంచో శ్రీపతి రాగయుక్తంగా ఏడుస్తున్నాడు.

సుదర్శనం బట్టలు మార్చి ముఖం కడుక్కోవడానికి నూతి వద్దకు వెళ్ళాడు. పద్ధతికి విరుద్ధంగా తల్లి మడికట్టుక బియ్యం కడుగుతోంది. సుదర్శనం యీ ఒక్క విషయంతోనే పరిస్థితి అంతా గ్రహించాడు. ముఖ ప్రక్షాళనానంతరం గదిలోకి వెళ్ళి సాయంకాలపు దుస్తుల్లోకి మారసాగాడు.

సరిగ్గా ఇదే సమయంలో తుఫాను విరుచుకు పడింది.

నట్టింటి లోంచి 'చెళ్ళు – చెళ్ళు'మని రెండు చరుపులూ, తారస్థాయి లో శ్రీపతిగాడి ఆర్తనాదాలూ ఒకదాని వెంబడి ఒకటి ఎడం లేకుండా విన వచ్చాయి. సరస్వతి షడ్జమ స్వరంలో అరవసాగింది.

"–––వెధవా! అంత పంతమా! కాదు – అంత పంతమా అంటాను. నన్నుకాల్చుకు తింటావా!? తిను వెధవా! తిను! తిను!" అంటూనే మరి నాలుగు చరుపులు చరిచింది.

అయితే – శ్రీపతిగాడైనా సామాన్యుడు కాడు. ఉన్నవాడు వేలెడైనా ఉపద్రుడు. వయసు మూడో ఏడే అయినా యీ పిడుగుల వాననుండి వాడిని రక్షించగల వారెవరో, వారి రక్షణ ఎలా పొందడమో వాడికి బహు స్పష్టంగా తెలుసు. అందుచేతే అమ్మమ్మనుద్దేశిస్తూ నిజంగా ప్రాణాలు పోయేవాడిలా అరవసాగాడు. "అమ్మమ్మోయ్! అమ్మమ్మా!! చంపేసిందేవ్! చంపేసిందేవ్" అంటూ గెంతుతున్నాడు.

వాడు రక్షణ కోసం అరిచేకొద్దీ శిక్ష హెచ్చసాగింది.

"చవ్వు! చవ్వరా! చవ్వు!" అంటూ బాదసాగింది సరస్వతి.

చివరికి 'అమ్మమ్మ' ఉచ్చస్వరంలో అరుస్తూ బయట పడింది–

"ఒసేవ్! వొసేవ్! వాణ్ణి కొడితే యేమొస్తుందే – నన్ను కొట్టు. నా మీద కోపం వాడి మీద తీర్చుకుంటే ఏమి లాభమే? వేలెడి వెధవ! చచ్చి ఊరు కుంటాడు, దుక్కలా ఉన్నాను. నన్ను కొట్టు. విన్నావా –– నన్ను కొడితే నీ కసి తీరుతుంది!"

––ఆమె ఆగింది. నిచ్చరబోయినట్టు చూస్తున్న సరస్వతి దిగాలు స్వరంతో "విను దొడ్డమ్మా!" అంది.

పార్వతమ్మ గారు వెనకటంత స్వరంతోనే అందుకున్నారు–––

"దొడ్డమ్మ వింటూనే ఉంది. లేకపోతే ఆ పసివెధవ నీతో పంతగిస్తున్నాడా! నిన్ను కాల్చుక తింటున్నాడా?" అని చప్పున గొంతు మారుస్తూ–– "ఎవరు నీతో పంతగిస్తున్నారని నువ్వనుకుంటున్నావో, ఎవరు నిన్ను కాల్చుకు తింటున్నారని నువ్వనుకుంటున్నావో, యీ తిట్లూ శాపనార్థాలూ ఎవళ్ళని ఉద్దేశించో.. అందరికీ తెలుసు!"

సరస్వతి యీ సారెందుచేతో ఎదురుమాట చెప్పలేదు. పార్వతమ్మగారే పై వ్యాఖ్యానాన్ని సమర్థించుకుంటూ చెప్పసాగారు.

"లేకపోతే అర్థణా అనగా ఎంత? నీ దగ్గర లేకపోతే నన్నడగ కూడదూ? ఇంతకు ముందు ఎప్పుడూ ఇవ్వలేదూ? లేకపోతే వాళ్ళ మామయ్య వచ్చాడు. వాణ్ణడక్కూడదూ? లేకపోతే ఆ సుబ్బులిని అడక్కూడదా? నాతో మాట్లాడ్డానికే నీకంత ససిపాటైతే వాళ్ళతో మాట్లాడ టానికేం? ఒకవేళ నీ హోదాకు అది చిన్నతనమే అయితే, కుర్రవెధవ – వాణ్ణే పోయి అడగమనకూడదూ?"

అని క్షణమాగి–

"అర్థణా కోసరం వాణ్ణి పట్టుకు చావగొడతావా? చిన్నపిల్లడి మారాం నీకు పంతమనిపించిందా? పసివాడు – వాడి గోల కొద్దీ ఏడుస్తే అది నిన్ను కాల్చుకు తినడమా!"

అని స్వరం మారుస్తూ–––

"సరే ఒప్పుకున్నామమ్మా! ఇంతకు ముందు వాడల్లరి చేసినప్పుడల్లా ఇలాగే బాదావా? ఇవాళే బాదావంటే అదెవరి మీద కోపం? ఆ దెబ్బలన్నీ ఎవరికి?"

"కుర్రవెధవ! అమ్మమ్మోయ్ అమ్మమ్మోయ్ అని ఆ తీరున అరుస్తుంటే అడ్డూ ఆపూ లేకుండా బాదుతావా? అదే వాడి అమ్మమ్మ బతికి ఉంటే వాడి ఒంటి మీద దెబ్బ పడనిస్తుందా? దిక్కుమాలిన అమ్మమ్మ, బతికినా చచ్చిన దాన్లో జమైన అమ్మమ్మ ––– యీ పెద్దమ్మమ్మ కాబట్టి వాడంతలా అరుస్తున్నా అడ్డు పడలేకపోయింది".

పార్వతమ్మగారు అలసిపోతూ ఆపేశారు. అంతవరకూ మౌనంగా వింటూన్న సుదర్శనం గదిలోంచి బయటకు వచ్చి అన్నాడు. ఇంట్లో మగాడంటూ ఉండి, ఏమీ అనకపోతే బాగోదని అన్నాడో, తల్లిని మందలించే ఉద్దేశంతో అన్నాడో, లేక సరస్వతి పక్షాన వకాల్తా పుచ్చు కున్నట్లు కనిపిస్తూ తల్లిపక్షాన అన్నాడో తెలియదు.

"అది దాని కొడుకుని కొట్టుకుంటే మధ్య నీకెందుకూ?" అన్నాడు.

పార్వతమ్మ రయ్యిన లేచిపోతూ జవాబిచ్చింది.

"అవును! అవున్నాయనా! అందుచేతే ఊరుకున్నాను. నాకు దానిని పెంచడానికి పెద్దదానిని చెయ్యడానికీ పెళ్ళిచేసి ఒక యింటి దానిని చెయ్యడానికీ అయితే స్వతంత్రం ఉందిగానీ––– అది స్వయానా మోసి కని పెంచుతున్న కొడుకుని సొంత చేతులతో కొట్టుకుంటూ ఉంటే అడ్డడానికేం స్వతంత్రం ఉందీ? అందుచేతే నోరు మూసుక ఊరుకున్నాను".

సుదర్శనం వెంటనే జవాబిచ్చాడు–––

"అయితే ఆ మాట మళ్ళీ అనుకోవడమెందుకూ?"

ఈ సూటి ప్రశ్న పార్వతమ్మగారిని క్లిష్ట పరిస్థితిలో పడేసి ఉండవలసింది. కాని ఆమె తన అమ్ముల పొదిలోని దిగ్భ్రమాస్త్రాన్ని ప్రయోగించి తప్పుకున్నారు.

"ఎందుకా? నీ చేతా నీ చేతా చెప్పుదెబ్బలు తినడానికి!"

అలా అంటూనే ఆమె వంటింటిలోకి వెళ్ళిపోయారు.

అంతతో తుఫాను శాంతించింది. ఆ నిశ్శబ్ద వాతావరణంలో కొంతసేపు మౌనంగా నిలబడి, తన చిరాకంతా బయటపడేటట్టు ఒక ముక్కు ముక్కి, సుదర్శనం చరచర బయటకు బయలుదేరాడు. నట్టింట్లోంచి దొడ్డమ్మ మందలింపు స్వరం వినిపిస్తోంది.

"అదేమిటి! పెద్దవాళ్ళేమైనా అంటే ఏడుస్తారా? ఊరుకో, దీపాలవేళ నట్టింట ఆడపిల్ల ఏడవరాదు" అంటోంది.

జోళ్ళు తొడుక్కుని సుదర్శనం వీధిమెట్లు దిగుతున్నాడు. వరండాలో సుబ్బులు శ్రీపతి గాణ్ణెత్తుకొని ఐస్ లడ్డూ వాలాని చూపిస్తూ ఏమిటేమిటో చెపుతోంది. ఆ టక్కరి వెధవ నత్తి నత్తిగా మాట్లాడుతూ మధ్య మధ్య నవ్వుతున్నాడు.

సుదర్శనం జోళ్ళు చప్పుడు చేసుకుంటూ మెట్లు దిగిపోయాడు.

### 3

సుదర్శనం తిరిగి వచ్చేసరికి ఏడు గంటలు దాటింది. తలుపు తొయ్యగానే అడుగు గమనించింది. నడవ వరండాలో లైటు లేకపోవడం. అరగంటైె విద్యుద్దీపాలకు

అలవాటువడ్డ కళ్ళను చీకట్లలో చూడటానికి బలవంతపెడుతూ నడవ దాటి వరండాలోకి వచ్చాడు. వరండా అంతరాళంలో కణకణ మెరిసే నిప్పుముద్ద – అక్కడ బావ గారున్నారనీ, బహుశా మడత కుర్చీలో కూర్చున్నారనీ సూచిస్తోంది. ఇంతలో సుబ్బులు హరికేన్ లాంతరు తీసుకువచ్చి దూలాన్నుండి వ్రేలాడే తీగెకు తగిలించింది.

నిప్పుముద్ద సూచనలో పొరపాటేమీ లేదు. బట్టలు మార్చుకోక పోవడం బట్టి చూస్తే బావగారు అప్పుడే వచ్చినట్టుంది.

సుదర్శనం కాళ్ళూ చేతులూ కడుక్కొని వచ్చి బట్టలు మార్చాక, షెల్ఫులోంచి పుస్తకాలూ, తీగె నుండి లైటూ తీసుకొని ముందు వేసుక కూర్చున్నాడు.

అలవాటు ప్రకారం భగవద్ధ్యానం చేశాడు కాని పుస్తకం తెరిస్తే ఏకాగ్రత సాధ్యం కాలేదు. ధ్యాన శ్లోకాలు మౌనంగా పఠిస్తుంటే జరిగిన నిరాడంబర సంఘటన అతని ఏకాగ్రతని చెరిచింది.

తుండు గుడ్డా, గూడకట్టు వాణీ భుజాన వేసుకొని యింకోచేతిలో గావంచాతో సరస్వతి బావగారిని సమీపించి గావంచా అందివ్వబోయింది. చాలా సెకండ్ల వరకూ సరస్వతి చేయీ, చేతిలో గావంచా అలా నిరీక్షిస్తూనే వున్నాయి. తరవాత సరస్వతి. అచ్చు భార్యలు భర్తలతో మాట్లాడే స్వరంతో అంది.

“లేవండి మరి!”

ఆ తరవాత కూడా కొన్ని సెకెనులు గడవనిచ్చి అతను బహు సాఫీ అయిన స్వరంతో జవాబిచ్చాడు.

“అప్పుడే తీరికయ్యిందా! ఇంకా ఇంత వేగం తెమిలి రాలేవను కున్నాను”.

దానికి సరస్వతి బదులు చెప్పలేదు. నిలబడి ఆమే, కుర్చీలోంచి అతడూ, కొన్ని క్షణాలు ఒకరి వంక ఒకరు చూసుకున్నారు. తరవాత అతను లేచి తాపీగా ఆమె చేతిలోంచి గావంచా అందుకుంటూ పెరట్లోకి నడిచారు.

ఇదే వరస. ఇవాళే కాదు – కొన్ని నెలలై రోజూ ఏదో ఇలాటిదే గొడవ. ఆ యింటికి ఏదో పట్టినట్టుంది. అంతవరకూ స్వర్గసీమలా ఉంటూ వచ్చిన యిల్లు కల్లోల సాగరంగా మారుతోంది. కొద్ది దినాలై అది కల్లోలినిగా మారిపోయింది.

ఇంట్లో వచ్చిన, వస్తున్న మార్పును అందరూ గుర్తిస్తున్నారు. దాని ఫలితాన్ని కూడా అందరూ అనుభవిస్తున్నారు.

ఒకప్పుడు ఆ యిల్లు ఆనందానికి నిలయం. ఎవరు ఎవరిని గురించి ఎంత లేసి మాటలన్నా, ఎటువంటి పరిహాసాలు ఆడదలచుకొన్నా నిర్భయంగా, నిశ్చింతగా ఆడుకోగలిగే వారు. అప్పుడు వాళ్ళు వాడే పదాలకు నానార్థాలూ, శ్లేషార్థాలూ ఉండేవే కావో లేక ఏళ్ళు పైబడ్డ కొద్దీ జ్ఞానం పెరిగిపోయి మాటల్లో శ్లేషలనూ, నానార్థాలనూ గుర్తించే శక్తి కొత్తగా వాళ్ళకు అబ్బిందో తెలియదు. ఏమైనా –యీ కొత్త తెలివితేటల వల్ల వాళ్ళు సుఖపడింది మాత్రం లేదు. ఆ యింట్లో ఏ ఒక్కరూ కులాసాగా ఆదమరిచి మాట్లాడుతున్నారని కానీ, కనీసం గట్టిగా ఊపిరి పీలుస్తున్నారని కానీ చెప్పలేము. కుటుంబ యజమాని తండ్రి దగ్గర నుంచి, చంటివాడు శ్రీపతి వరకూ అందరూ యీ కలత కల్లోలినీ తరంగాల సుడుల్లో సతమతమౌతున్నారు. దీనికి పరిష్కారాన్ని మాత్రం ఏ ఒక్కరూ యోచిస్తున్నట్టు లేదు. కనీసం యత్నించాలనే జ్ఞానమైనా ఉన్నట్టు లేదు.

ఒక్కో అప్పుడు సుదర్శనమే కొన్ని అనవసరపు ప్రశ్నలకి జవాబులు ఆలోచిస్తుంటాడు. అసలు యీ గొడవకు మూల కారణాలేమిటి? తప్పు ఎవరిది? ఎంత ఆలోచించినా అతనికి వెతుకులాటగానే ఉంటుంది. ఇప్పుడు కూడా వాటి గురించే ఆలోచిస్తున్నాడు.

కొంతసేపయాక తండ్రి డాబా మెట్లు దిగుతున్న చప్పుడయ్యింది. సంధ్యావందనం ముగిసినట్టుంది. భోజనానికి పిలుపు రాగానే ఎలా తెరిచిన పుస్తకం అలానే మూసేసి లేచిపోయాడు సుదర్శనం.

## 4

సుదర్శనానికి మర్నాడు శెలవు. మధ్యాహ్న భోజనమయ్యాక అలా వీధిలోకి వెళ్ళి సిగరెట్ ఒకటి కాల్చుకొని వచ్చాడు.

నట్టింట తల్లీ, పెత్తల్లీ దగ్గరగా ఒకళ్ళకొకళ్ళు ఎదురుగా కాళ్ళు చాపుకొని కూర్చున్నారు. తన అలికిడి వినగానే ఇద్దరూ వీధి గుమ్మంకేసి చూశారు. సుదర్శనం తిన్నగా గదిలోకి వెళ్ళిపోయాక రహస్యం చెప్పే ధోరణిలో పార్వతమ్మగారు కథనం సాగించారు.

‘‘ఆఁ.. తర్వాత––– అది–– శ్రాద్ధమూ అవీ అయిపోయాయి. అప్పుడూ వచ్చింది అసలు సమస్య – పిల్లను ఎవరు పెంచటం? అతడికేమో ఇరస్తా పరస్తా ఎవ్వరూ లేరు. ఒక అప్పజెల్లెలు ఉందన్న మాటేగాని చివరకు దీని పెళ్లిలో కూడా వచ్చి – అయ్యో! తల్లిలేని పిల్ల! ఇప్పుడు తండ్రి కూడా లేదు – అని ఓ చీరగుడ్డా ఇంత పసుపూ కుంకం పెట్టిన పాపానైనా పోలేదు. అంతటి అభిమానం – ఆ మహాతల్లిది! పన్నెండ్రోజుల పసిగుడ్డును భుజాన వేసుకొని పెంచడానికి సిద్ధమౌతుందా? టక్కు పెట్టేసి ఊరుకుంది. ఇంక – వీరా?

వారా? ఎవరు పుచ్చుకుంటారు యీ పిల్లను? అంటూ చివరకు తీసుకొచ్చి నా మీద పడేశారు.

అప్పటికి నా పరిస్థితి కూడా అలాగే ఉంది.

జ్ఞాపకం ఉందా? మీరు ఖరగపూరులో... అఁహాఁ... కాదు కలకత్తాలో ఉండేవారు. ఇలా మాకు మగపిల్లడు పుట్టిపోయాడని మేం రాస్తే – బావగారి కప్పుడేదో చికాకు చేసింది – అందుచేత మీరెవ్వరూ రాలేకపోయారు. మా ఉత్తరానికి జవాబు కూడా రాకపోతే మేమేదో అనుకోడం మీరేదో అనుకోడం – ఆ గొడవలన్నీ అయ్యాయి చూశా, అప్పుడే.

సరీగ్గా జ్యేష్ఠ శుద్ధ తదియనాడు నాకు కానుపు కలిగింది. పిల్లాడు పుట్టి ఆ రాత్రే పోయినాడు. మళ్ళా ఆషాఢ శుద్ధ తదియనాడు మా చెల్లెలికి పురుడు వచ్చింది. అంటే తిథులతో సహా సరిగ్గా నెల్లాళ్ళన్న మాట.

మా మరిది వచ్చి అన్నాడు---

అమ్మా! అతనెప్పుడూ నన్ను అమ్మా అనే అనేవాడు. అమ్మా! దేవుడు ఎందుకు ఎప్పుడు ఏ పని చేస్తాడో తెలియదు. మీకు పుట్టిన పిల్లణ్ణి దక్కనీకుండా చేశాడు. ఈ పిల్లకు కనుక్కున్న తల్లిని కరువు చేశాడు. దీనిని పట్టిచూస్తే మీ యిద్దరికీ ఘటన రాసి ఉందన్న మాట. ఇది మీ గర్భవాసాన పుట్టవలసిన పిల్లే అయి వుంటుంది. ఎక్కడో ఏదో పొరపాటు జరిగి, అంతా తారుమారైపోయి చివరకీ విధంగా కలుపుకొస్తున్నాడు. ఇంక మీరీ పిల్లను పెంచక తప్పదు. మీరు కూడా కాదూ కూడదూ అంటే దాని పీక నులిపి ఏ నూతిలోనో పడేసి ఆ వెంటనే నేను కూడా దూకేస్తాను – అన్నాడు".

ఇలా చెప్పి పార్వతమ్మగారు తోడికోడలు ముఖంలోకి చూస్తూ ఆగారు. కాని, ఎంతకూ ఆమెనుండి రావలసిన ఆశ్చర్య ప్రకటన రాకపోగా... ఆ చివరి వాక్యాన్నే మళ్ళా వ్యాఖ్యానిస్తూ తమ కథనం సాగించారు.

''---ఇంక మీరు కాదంటే నుయ్యో గొయ్యో చూసుకోవాలంటాడూ! అప్పుడు నాకు చాలా జాలివేసింది. అయ్యో నాయనా! యీ మాత్రం మహా భాగ్యానికి యింతలా ప్రాధేయపడాలా? నాకు మాత్రం ఏ పది మంది ఉన్నారు -- అప్పటికి మా సుబ్బులింకా పుట్టలేదు -- తప్పకుండా అలాగే పెంచుతాను అన్నాను.

అది లగాయితూ – అంటే పిల్లను మేమిక్కడకు తీసుకువచ్చేశాక – ఆరు మాసాలదాకా తిరిగి చూడలేదు. ఆ తరువాతైనా, ఇంక బాగోదనీ నలుగురూ అని పోతారనీ ఆర్నెల్లకో ఏడాదికో ఎప్పుడు తనకి వీలైతే అప్పుడు ఒకసారొచ్చి చూసేవాడు. ఆ ముచ్చట మాత్రం ఎన్నాళ్ళు సాగిందని? అది చచ్చిన రెండేళ్ళకే యీయన కూడా హరీమనేశాడు.

---అఁ చెప్ప వచ్చేదేమంటే-- అటువంటి పసికందుని తీసుకొచ్చాను. తీసుకొచ్చాక పెంచి పెద్దదాన్ని చేశాను. నాకు పోయింది మగపిల్లడు. పిల్లడికి బదులు ఆడపిల్లైతే బతికుణ్ణేమో? ఆ పిల్లే యీ పిల్లనుకొని పెంచాను. అలా పెంచినందుకు అది కూడ విశ్వాసం కలిగుంది ఏమాటకామాటే అనుకోవాల. దానికి ఎనిమిదేళ్ళు వచ్చి కాస్త జ్ఞానం తెలిశాక ఆనోటా ఆనోటా కథంతా తెలుసుకుంది. అఁహాఁ అలానా – అని అక్కణ్ణుంచి ప్రవర్తన మార్చేసుకుంది.

నేను తొమ్మిదేళ్ళ క్రిందట జబ్బుపడ్డాను జ్ఞాపకం ఉందా? ఆయన టెలిగ్రాం యిస్తే, బావగారు రావడానికి వీల్లేకపోతే, పెద్దవాణ్ణి తోడు తీసుకొని వచ్చావు!

అప్పుడు జబ్బు నయమయ్యాక మీరు వెళ్ళిపోయారు. ఆ తరువాత ఆర్నెల్లుదాకా ఇటున్న చీపురుపుల్ల అటు పెట్టలేదు – అటు పెట్టనివ్వ లేదది. అప్పటికి దానికెన్నేళ్ళూ? పదేళ్ళుంటాయేమో! అయినా అలానే చేసింది పాపం. అందుచేతే పేగులోంచి వచ్చింది కాకపోయినా అదీ నా కూతురనే అనుకున్నాను. సొంత కూతురికి జరిపినట్టే ముద్దూ ముచ్చట్లన్నీ దానికీ జరిపాను. పెళ్లికి బంగారమంటే, కట్నాలంటే, తరవాత్తరవాత లాంఛనాలంటే ఏం తక్కువయ్యాయా అక్కయ్యా! నీకు తెలీందేముందీ!

అయితే – మాటే దక్కింది గాదు. మేమిప్పుడు చేదైపోయాం. పెళ్ళయింది. పెళ్ళికాదు – ఆయన గారికి ఆ మామగారు ఉద్యోగం వేయించి ఇంట్లో తెచ్చిపెట్టారు. ఆరంభమయ్యింది రగడ. ఎందుకూ? – అంటే ఏమీ లేదు..."

పార్వతమ్మగారు ఆరంభమైన రగడ గురించి ఆరంభించక ముందే సుబ్బులు వచ్చి అంతరాయం కలిగించింది.

సుబ్బులు వోణీ చెరగుతో చేతులు తుడుచుకుంటూ అడిగింది...

"ఆ కథ మీ అక్కగారికి తర్వాత చెపుదువు గాని, ముందు నాకిది చెప్పు, నన్నిప్పుడేం చెయ్యమన్నావ్?"

కథనంలో లీనమైపోయిన బుద్ధిని వర్తమానంలోకి తెచ్చుకోడానికి పార్వతమ్మ గారికి ఓ నిముషం తీసుకుంది కావోలు!

అంతవరకూ విమూఢవలె కూతురు వంక చూస్తూ అకస్మాత్తుగా అన్నారు.

"అఁ.. ఎంగిళ్ళు పూర్తయ్యాయా?"

సుబ్బులు నవ్వుతూ అంది...

"అబ్బ: తెలివి వచ్చింది! అయ్యాయి"

"అయితే – గిన్నెల్లో అన్నం కూరా అవీ పళ్ళెంలో పెట్టేసి మూతెట్టి ఉంచు. గిన్నెలు నూతి దగ్గర పడెయ్యి".

"అన్నం చల్లారిపోదూ?"

"చల్లారితే చల్లారుతుంది. ఆ మహారాణీగారు ఎప్పుడొస్తారో – అంతవరకూ ఎవరు కాచుక్కూచోగలరు? పోనీ అదే పడేస్తుందేమో అంటే, ఈలోగా పని మనిషొస్తే నువు మళ్ళా మడిగట్టుకొని అంట్లు వెయ్యాలి. లేదా ఆ అంట్ల గిన్నెలతోనే రాత్రికి పండుకోవాలి".

ఎందుచేతో క్షణమాలోచించి, సరే అంటూ వెళ్ళిపోయింది సుబ్బులు.

తరవాత పార్వతమ్మగారు తోడికోడలి వంక తిరిగి కథ ఆరంభించ పోయింది. కాని సుబ్బులు వచ్చి తెంచిన భావనాజాలం చివర దొరికింది కాదు. మరొక కొత్త కొనతో ఆరంభించింది.

"పెళ్ళయిందీ--- దాని తత్వం మారిపోయిందక్కయ్యా!"

ఎంతసేపూ తన మొగుడూ తన పిల్లడూ తనే కాని తక్కిన వాళ్ళు ఉన్నారా చచ్చేరా అనేనా చూడదు. ఒక నీళ్ళందివ్వ వలసివస్తే ముందు తన మొగుడికి. ఒక పాలందివ్వ వలసివస్తే అతడికే ముందు. ఎందులోనైనా అతడి పని ముందైపోవాలి. తక్కినవాళ్ళు మనుషులు కానట్టూ అతడొక్కడే ఆకాశం నుండి ఊడిపడ్డట్టూ ప్రవర్తిస్తుంది.

మొదటల్లా కొత్తల్లుడు. చుట్టరికానికి వచ్చి పోతున్నాడు.అందలమెక్కిస్తే ఎక్కించావు. బాగానే ఉంది.

అతడికి ఉద్యోగం వేయించి, పోనీ కదా – ఆ వచ్చే నాలుగు రాళ్ళతో గడుపుకోవడం కష్టం కదా – అని ఇంట్లోనే పెట్టుకొని .. నీకు చేసిందే కాక నీ మొగుడుకి కూడా చేస్తున్నామే! అది గమనించొద్దూ? ఏమేనా అంటే తెచ్చిన జీతం అంతా మీకే ఇస్తున్నాం కదా!... ఇస్తే మాకేమేనా... మిగిలిపోతోందా?"

అంతవరకూ ధారాళంగా సాగుతూ వచ్చిన పార్వతమ్మ వాగ్ధోరణి అక్కడికొచ్చేసరికి ఎందుకనో బెక్కడం ఆరంభించింది. ఎదుట ఉన్న మనిషికి గుర్తించే శక్తిలేదు గాని చెప్పే ఆమె మనోనేత్రాల్లో ప్రతిఫలించే తబ్బిబ్బు చిహ్నాలు ఆమె బాహ్య నేత్రాలలో కూడా ప్రతిఫలిస్తూనే ఉండాలి.

ఆమె ఎలా నిలదొక్కుకుందో చివరకు యధాస్థితికి వస్తూ చెప్పసాగింది.

"పోనీ నువ్వు చెప్పు. ఇంట్లో నలుగురున్నాక నలుగురూ ఒక్కసారి భోజనానికి లేవాలా! ఆయనిప్పుడు తినరట – అని ఆయనకు నువ్వు ప్రత్యేకంగా వడ్డిస్తావు. ఎందుకనీ? పండుక్కో పున్నానికో పిండివంట చేసుకుంటే ఆయన గారికి వేరే పిండివంట కావాలంటావు. సామాన్యులం – ఒక్కొక్కరికీ ఒక్కొక్క వంట అంటే ఎలాగా? ఆ మాటంటే వారం రోజులు మూతి ముణగదీసుక కూర్చుంటావా? మన మొకళ్ళింటిలో ఉన్నప్పుడు నలుగురితో సమానంగా తిని నలుగురితో పాటు నాలుగు పనుల్లోనూ మనమూ చెయ్యి సాయం కావాలా! ఆ జ్ఞానం నీ మొగుడికీ లేదు – నీకూ లేదు.

ఇలాగైతే ఎలాగ చెప్పక్కయ్యా!"

అని ఏవేవో జ్ఞాపకాలు ముసురుకు రాగా భావనా ప్రపంచంలో తబ్బిబ్బును నిలువరించుకుంటూ–

"ఉదయం లేచింది లగాయితూ ఆయనగారు గుమ్మం దిగేదాకా – ఇలా ఒక్కపని ముట్టుకోదు. అంతసేపూ ఆయనగారి సేవే. ఏడ్చే పసి పిల్లడినైనా తీయదు. అదీ ఎవరి పిల్లడు – తన పిల్లడే! ఆయనగారు యింట్లో ఉండగా, ఒక అన్న కాదు నేను కాదు స్వయానా వాళ్ళ పెద్దనాన్న గారు పనిచెప్పినా, ఇదుగో అంటుంది – కాని కనిపించదు. అంతగా అయితే – సుబ్బులూ! నాన్నగారికేదో కావాలట చూడూ, అని చెల్లెలికి పురమాయించేస్తుంది. ఆయనకు చెయ్యడానికి ఇదే కావాలా – నేనున్నాను సుబ్బులుంది. చెపుతున్నాను – మాటకి".

అని---

"ఇంక ఆ మొగుడంటే – అదెక్కడి మొగుడో! అదెక్కడి లోకమో – లోకంలో ఏ ఆడదీ అలా మొగుడి కోసం పడి చావదు. అతడు ఆడింది అబద్ధమేకానీ, సుబద్ధమే కానీ, ఆయనన్న దానికి అర్థం ఉండనీ, అర్థం లేకపోనీ – అతడన్నదే మాట! మొగుడి యందు అటువంటి అభిమాన తాత్పర్యాలుండటం మంచిదే. మనం కాదనం. మన వంటి పెద్దలు కోరుకునేది, వెయ్యేళ్ళకూ వాళ్ళలా ఉండాలనే. కాని విచక్షణ అన్నది బొత్తిగా విడిచేయడమే? ఆయనగారి మాటే వేదమా? ఇంక ఇవతలి వాళ్ళ మాట వినిపించుకోవలసిన అవసరమే లేదా – అంటాను.

పుట్టుగుడ్డుగా ఉన్నప్పుడు నిన్ను తీసుకువచ్చానే! పెంచానే! పెద్దదాన్ని చేశానే! పెళ్ళి చేసి ఒక యింటిదాన్ని చేసి నిన్నింట్లో కూడా పెట్టుకున్నానే! నిన్నగాక మొన్న వచ్చిన మొగుడే దేవుడైనప్పుడు – ఆయన గారి మాటే వేదవాక్యమైనప్పుడు – ఇన్నివిధాల చేసిన మేమేమవ్వాలి? మా మాటే మవ్వాలి? ఆ జ్ఞానం నీకేమైనా ఉందా కృతజ్ఞతన్నది నీ కడుపులో ఏ

కోశానైనా ఉన్నదా?"

పార్వతమ్మ ఎంత ఆవేశంగా వాదించినా తోడికోడలు తన సానుభూతి ఏ కొంచెం కూడా వ్యక్తం చెయ్యలేదు. ఆమె యీామెకన్నా వయసులోనే కాక అనుభవంలో కూడా పెద్దది. అంచేత ఆమె కడుపులో ఉన్న బాధేమిటో గ్రహించడానికి ప్రయత్నం చేస్తోందే తప్ప ఆమె గృహచ్ఛిద్రం లో కలుగ చేసుకోడానికి ప్రయత్నం చేయడం లేదు.

కొంతసేపయ్యాక పార్వతమ్మగారు సాధిత శాంతయై చెప్పసాగారు.

"నేను అందుకూ ఏమీ అనలేదు. అసలు దీని అభిమానం ఎవరికి కావాలి. పనిలో దీని సాయం ఎవరికి కావాలి? మాకు మా పిల్లలు ఇద్దరున్నారు – కాళ్ళు కడిగి నెత్తిమీద జల్లుకోడానికి, ఎంతచేసినా పరాయి పేగు పరాయిపేగే అని నాకు మొదట్నుండీ తెలుసు. అయితే – ఒకమాట.

ఇదీ – ఇది నన్ను మోసం చేసింది. ఇది యిచ్చకాల బుచ్చని నేను కానుకోలేక పోయాను. పెళ్ళి కానంత కాలం – నన్ను నెత్తిమీద దేవతలా చూసుకుంది. పెళ్ళై దానికో ఆధారం దొరికిందీ అనగానే – ఏదో సామెత చెపుతారు చూశా – ఏరుదాటి తెప్ప దగలేశారని, అలాగా – పోపోస్ నీ లక్ష్యమేమిటన్న ధీమా వచ్చేసింది దానికి..."

ఆమె చెప్పవలసింది ఇంకా ఏదో ఉంది. కాని ఆమె స్వరం మారి పోతోంది. ముఖకళలు కూడా ఆమె నిగ్రహానికి లొంగడం లేదు. ఏ క్షణాన్నైనా ఆమె ఏడ్చేయవచ్చు అనుకుంది తోటికోడలు.

కాని ఆమె ఏడవలేదు. మౌనంతో ఆమె దానిని ఆపుకుంది. ఇంతలో సుబ్బులు వంటింటి చక్కబాట్లు పూర్తి చేసుకొని వచ్చింది. ఎవ్వరూ మాటాడ్డం లేదు. ఒక సుదీర్ఘ విశ్వాసం విడిచి పార్వతమ్మ గోడకు చేరబడి పోయింది.

చివరకు స్నేహితురాలి దగ్గరకెళ్ళిన సరస్వతీ, ఆమె కొడుకూ రాకతో ఆ సంభాషణ పూర్తిగా ఆగిపోయింది.

### 5

సరస్వతి ఎక్కడకు వెళ్ళిందో తెలుసుగాని ఎందుకు వెళ్ళిందో సుదర్శనంకే కాదు ఇంట్లో ఎవ్వరికీ తెలియదు.

వారం రోజులనాడు, ఆ ఉదయం, స్నానం చేసి వచ్చి నట్టింట అద్దం ముందు నిలబడి సుదర్శనం తల దువ్వుకుంటున్నాడు. సుబ్బులు గొంతు వినవచ్చింది.

"ఇది పనికివస్తుందా?"

"అది ఏమాత్రం ఉడుకుతుంది?"

ఆ గొంతు తండ్రిది. సుదర్శనం వింతతో వెనుతిరిగి చూశాడు. సుబ్బులు చేతిలో ఓ గిన్నె ఉంది.

"రెండు తవ్వలు ఉడుకుతుందనుకుంటాను".

"సరే. అది అక్కడపెట్టి మన చిన్న పప్పుగిన్నె పట్రా".

సుదర్శనానికి అప్పటికింకా అంతు చిక్కలేదు. కాని కొద్దిసేపట్లోనే విషయం తెలిసింది.

తొమ్మిది గంటలకు సరస్వతి వేరింటి కాపరానికి సన్నాహాలన్నీ పూర్తయ్యాయి.

అంతవరకూ పార్వతమ్మగారు అలా వంటయింటిలోనే కూర్చుండి పోయారు. పెదతల్లి కొంతసేపు నట్టింటా కొంతసేపు నడవలోనూ కాలక్షేపం చేశారు. బావగారు నడవ వరండాలో కుర్చీలో చొరబడి సిగరెట్ మీద సిగరెట్ తగలేస్తున్నారు. శ్రీపతి అమాయకపు ప్రశ్నలతో అందరి గుండెలూ కలచేస్తూ యిల్లల్లా కలయ తిరుగుతున్నాడు. కూతుళ్ళిద్దరూ తండ్రి ఆదేశాలను నిర్వహిస్తున్నారు. తొమ్మిదిన్నరకు బళ్ళొచ్చాయి. ఒక పెట్టె బండీ ఒక సామాను బండీ.

సామానులు బళ్ళకెత్తిస్తూ "నువ్ తెములమ్మా!" అన్నారు తండ్రి.

ఈ హెచ్చరికతో సరస్వతి ఒక్కసారి తుళ్ళిపడింది. ఎదురుగా ఉన్న చెల్లెలు ముఖంలోకి చూసింది అక్క అసహాయ స్థితికి జాలేసింది సుబ్బులికి.

"పద" అంది వంటింటివైపు తల విసురుతూ.

సరస్వతి ఆమె వెంట వంటింటివైపు నడిచింది. ఎంత ప్రయత్నించినా ద్వారం దాటి అడుగు ముందుకు పడింది కాదు. గుమ్మం దగ్గరే పెదతల్లికి కనిపించీ కనిపించనట్టు నిల్చుంది. గోడకు చేరబడి శూన్యంలోకి చూస్తున్న పెదతల్లి ఆమెకేసి చూడలేదు. సుబ్బులు లోపలికెళ్ళి తల్లి పక్కనే నిలబడి అక్కకు సైగచేసింది. కాని ఆమెకు అప్పటికీ ధైర్యం చాలలేదు. సుబ్బులే సాహసాన్ని కూడదీసుకుంటున్నట్టు---

"అక్క చెప్పడానికొచ్చింది" అంది బెరుగ్గా.

పేలుతుందనుకున్న బాంబు పేలలేదు.

సుబ్బులు, ఫరవాలేదు కానీ, అన్నట్టు సైగ చేయగా–

"వెళ్ళి వస్తానమ్మా!" అంది సరస్వతి పెగిలిరాని గొంతుతో.

"అమ్మ చచ్చిపోయిందని చెప్పు!"

ఆ తీవ్రతకి గతుక్కుమంది సుబ్బులు కూడా. సరస్వతికి కళ్ళ నీళ్ళు గిర్రున తిరిగాయి. పైటచెంగుతో కళ్ళొత్తుకుంటూ కుమిలిపోసాగింది. సుబ్బులుకి ఇటు తల్లితో ఏదేనా అనాలో, అటు అక్కను ఓదార్చాలో తెలియక సతమతమవుతోంది. ఇంతలో బయట నుండితండ్రికేక వినపడింది.

"ఇంకేమిటమ్మా ఆలస్యం?"

"వచ్చే" అంది సుబ్బులు. అంటూ ఆమె గబగబా బైటకి

వచ్చి అక్క భుజమ్మీద తడుతూ ఆమె తలెత్తగానే పద అన్నట్టు సైగచేసి తండ్రి దగ్గరికి పరుగెత్తింది.

లోనికి తొంగి చూసిన సరస్వతికి, లోపలపెద్దమ్మ ఒక చెంప మాత్రమే కనిపిస్తోంది. ఆమె నిశ్చలంగా ప్రతిమలా కూర్చుని ఉంది. వంగి అక్కడ నుంచే నేలంటి నమస్కరించి కళ్ళు తుడుచుకుంటూ బయలుదేరింది సరస్వతి.

తిరిగివస్తూ నట్టింట ఎదురుపడ్డ దొడ్డమ్మకు కూడా పాదాభి వందనం చేసి--

"వెళ్ళొస్తాను దొడ్డమ్మా!" అంది బొంగురుపోతున్న కంఠంతో.

దొడ్డమ్మ ఆమె భుజాలు రెండూ పట్టుక లేవనెత్తుతూ–

"క్షేమంగా వెళ్ళి లాభంగా రా!" అంది. ఆమె గొంతులో కాని, ముఖంలో కాని ఏవిధమైన ఆవేశమూ లేదు.

బయట సుదర్శనం, సరస్వతి భర్తా రోడ్డుమీద ఉన్నారు. సరస్వతి భర్త బళ్ళ వాళ్ళకు గుర్తులు చెబుతున్నాడు. బళ్ళవాళ్ళకి గ్రహణశక్తి తక్కువో లేకపోతే అది వాళ్ళ పద్ధతో ఎన్ని గుర్తులు చెప్పినా గమ్యస్థానాన్ని గ్రహించ లేకపోతున్నారు. చివరకు సరస్వతిని చూడగానే అందులో ఒకడు అడిగాడు.

"కిందటోరం ఆయాళ మనం ఎళ్ళిన యింటికేటమ్మా?" అన్నాడు సరస్వతిని ఉద్దేశించి.

"ఆఁ... ఆ యిల్లే!...." అన్నారు బావగారు.

అంతవరకూ యీ నిర్ణయం అకస్మాత్తుగా జరిగిందా? ఎప్పుడు జరిగింది? ఎలా జరిగింది? అని సుదర్శనం ఆశ్చర్యపోతున్నాడు.

బావగారు ఆ మాట అనగానే యీ కుట్ర యీనాటిది కాదన్నమాట అనిపించి ఆవేశంతో అతని ఒళ్ళు వేడెక్కిపోయింది.

సరస్వతి బండెక్కాక భర్త శ్రీపతిని అందిచ్చాడు. బండి కదులుతుంటే శ్రీపతి తొందర తొందరగా అన్నాడు.

"అమ్మా! అమ్మా! అమ్మమ్మ..." అమ్మమ్మ రాదేం అన్నట్టు ప్రశ్నిస్తు న్నాయి వాడి చూపులు.

తల్లి దీనికేమీ జవాబివ్వలేదు. వస్తున్న దుఃఖాన్ని అదుపులో పెట్టుకుంటూ కొడుకు తలను గుండెలకదుముకుంది.

ముందు సామాను బండీ, వెనక పెట్టెబండీ నడుస్తుంటే అల్లుడు మామలిద్దరూ ఆ వెనక నడుస్తున్నారు.

వరండాలోంచి అక్కనూ కొడుకునూ చూస్తున్న సుబ్బులు అక్క సైగకి జవాబుగా తలూపుతోంది. అది చూసి సుదర్శనం–

"ఇంక చాల్లే! పద" అంటూ లోపలికి వెళ్ళిపోయాడు.

---

సాయంకాలం కాలేజీ నుంచి వచ్చిన సుదర్శనం ముఖం కడుక్కుని ఇంట్లోకెళ్తుంటే సుబ్బులు ఎదురై అడిగింది.

"మధ్యాహ్నం భోజనానికి రాలేదేం అన్నయ్యా!"

ప్రక్కన తల్లి ఉండగా అలా అడిగినందుకు సుదర్శనానికి కోపం వచ్చింది.

ఆమె అక్కడ ఉంది కాబట్టే దాన్ని ప్రదర్శించకుండా లోపలికెళ్ళి పోయాడు. సుబ్బులిది గ్రహించలేదు. వెంటాడింది.

"ఎందుచేతంటే మాటాడ్డేమీ?"

ఈసారి తల్లి కాస్త కనుచాటవడంతో సుదర్శనం ఆమె వంక ఎర్రగా చూశాడు. అదే సమయంలో తల్లి నుండి ప్రత్యుత్తరం వచ్చింది.

"ఎందుచేతా యివాళ మీ అమ్మ శ్రాద్ధం. అందుచేతే తండ్రీ కొడుకు లిద్దరూ ఇవాళ అభోజనం ఉన్నారు".

సుదర్శనం ఒక్కసారి ఉగ్రుడైపోయాడు. ఆ మంటంతా చెల్లెలి మీదికి మళ్ళిస్తూ హుంకరించి – "విను. కడుపు నిండిందా?" అన్నాడు మందస్వరంలోనే అయినా తీక్షణంగా.

సుబ్బులు నాలిక్కరుచుకుంది. మాటాడకుండా అక్కణ్ణుంచి వెళ్ళి పోయింది. మళ్ళా రాత్రి వడ్డనల వరకూ సుబ్బులు పెదవి కదపలేదు.

ఒడ్డిస్తూ ఒడ్డిస్తూ తండ్రికి అన్నం వేసేటప్పుడు అంది–

"మరి కొంచెం వేయించుకోండి, మధ్యాహ్నం అన్నం తినలేదు కదా!"

దానికి తండ్రి నవ్వుతూ జవాబిచ్చాడు.

"అదా సంగతి! అన్నానికి ఇంటికి రాలేదనా? రాలేదు కాని అన్నం తిన్నాను. ఇవాళ అక్క పాలు పొంగించాలి కదా. అక్కడే అన్నం పెట్టేస్తా నంది. పెట్టేమన్నాను. తిని అలా ఆ దారినే ఆఫీసుకెళ్ళిపోయాను. కొత్త కాపురం కదా – ఎవరో ఒకరు పెట్టించాలి".

ఆ మాట మీద తల్లి ఏం మండిపడుతుందో అన్నట్టు–

"ఏమో మరి! మాకేం తెలుసూ?" అంది సుబ్బులు.

''అదే, మీకు చెప్పలేదు. వెళ్ళేటప్పుడు చెవుదామనుకుంటూనే మరిచి పోయాను".

అప్పటికీ పార్వతమ్మ గారు మాటాడక పోవడం సుదర్శనానికే కాదు. సుబ్బులికి కూడా ఆశ్చర్యమేసింది.

**6**

సరస్వతి భర్తతో వేరెళ్ళిపోవడం తక్కిన వారిని ఎంతవరకూ బాధించిందో గాని సుదర్శనాన్ని చాలా బాధపెట్టింది.

అతడికి ఊహాలోకాల్లో విహరించగల చురుకైన మెదడుంది. ఒంటరిగా బాధపడి ఆవేశపడడానికి కావలసిన వయసూ, తీరికా ఉన్నాయి. అంచేత పుస్తకాలు ముందేసుకొని

సరస్వతి పూర్వ స్నేహాన్ని, మారిపోయిన ఆమె గుణాన్నీ, తల్లి వ్యాఖ్యానించిన వెలుగుల్లో చూసి ఒకసారి కోపం తెచ్చుకునే వాడు, ఒకసారి దిగులు పడేవాడు.

అతడికి తన బాధ పంచుకునేందుకు బయట స్నేహితుల్లేరు. ఇప్పుడు ఇంట్లో సరస్వతీ లేదు.

ఆవేళ అతడు పెత్తల్లిని రైలెక్కించడానికి వెళ్ళేడు. రైలుకింకా లైన్ క్లియర్ కాలేదు. ప్లాట్‌ఫారం నిండా మనుష్యులూ, మనుషుల్ని మించి గుట్టలు గుట్టలుగా సామానులూ – కాలు పెట్టడానికి చోటులేదు. ఒక చివరగా కుంకుడు చెట్టు క్రింద నల్లని పెద్ద ట్రంకు మీద పెత్తల్లీ, ఒక గోనె మూట మీద సుదర్శనం కూర్చుని మాటాడుకుంటున్నారు.

"నాకు యీ ఒక్క దానికే కష్టమనిపిస్తుంది దొడ్డమ్మా! ఇంతచేసినా చివరకు ఆమెకు మాట దక్కకుండా చేసింది. వాళ్ళు వెళ్ళి వేరే ఉండాలంటే ఉండవచ్చు. కాని మాటామాటా అనుకోక ముందే, అంతా సవ్యంగా ఉన్నప్పుడే, వెళ్లిపోయి వుంటే యే బాధా లేకపోను. ఇప్పుడు నలుగురూ ఏమనుకుంటారు – కాట్లాడుకొని విడిపోయారంటారు. అభిప్రాయ భేదాలు రాకముందే విడిపోతే ఇప్పట్లా ముఖాలు చూసుకోని స్థితి రాకపోను" అన్నాడు సుదర్శనం.

సుదర్శనం ఏం మాట్లాడుతున్నాడో అతడికి తెలియదు. అభిప్రాయ భేదాలు లేకపోతే అంతా సవ్యంగానే ఉంటే విడిపోవలసిన అవసరమే ముంటుందీ.

అయితే అతడెందుకు మాటాడుతున్నాడో పెత్తల్లికి తెలుసు. సరస్వతీ, సుబ్బులూ ఇద్దరూ సుదర్శనానికి చెల్లెళ్ళే అయినా అతడికీ సుబ్బులుకి వయోభేధం చాలా ఉంది. చిన్నప్పణ్ణుంచీ సరస్వతే సుదర్శనంతో కలిసి పెరిగింది. ఇప్పుడామెతో శత్రుత్వం కొనసాగించవలసి రావడం అతడికి సాధ్యపడకుండా ఉంది.

"అమ్మ తత్వం నీకు తెలుసు. బహు పట్టుదల మనిషి! మళ్ళా ఆ యింటికాకి యీ యింటి మీద వాలుతుందనుకోను. మేమైనా అమ్మను కష్ట పెట్టలేం కదా!...

సుదర్శనం యీ విధంగా మూడు ముక్కలతో సంబంధాలు తెగ కొట్టేశాడు. అందులో అతని బాధే అతనికి తెలుసు, మరి సరస్వతి సంగతో? తల్లీ తండ్రీ లేని సరస్వతి, ఏడుస్తూ తనకి నమస్కరించిన సరస్వతి, జ్ఞాపకం రాగానే పెత్తల్లి అంది.

"పోనిస్తూ అబ్బాయ్! చిన్నపిల్ల. తెలిసో తెలియకో ఏదో తప్పుగా ప్రవర్తిస్తే పెద్దవాళ్ళు మీరే గడుపుకోవాలి. చదువుకున్న వాడివి– నువ్వూ అలా అంటే ఎలా?"

"కానీ అమ్మ మాట దొడ్డమ్మా? అమ్మకు ఎవ్వరం చెప్పలేం. నాన్నగారూ ఎదురు చెప్పరు, కాపోతే తన పని తాను చేసుకుపోతారు".

"మీరూ ఎదురు చెప్పకండి. మీ పని మీరు చేసుకుపోండి" అంది గుంభనంగా.

అని–

"దానికి మాత్రం ఎవ్వరున్నారబ్బాయ్? ఇంకా చిన్నపిల్ల, పురుళ్ళూ పుణ్యాహ వచనాలూ అన్నీ ముందే వున్నాయి. అప్పుడే ఒదిలి పెట్టేస్తే ఎలాగా?"

"ఆ జ్ఞానం దానికుండాలి"

ఆడపిల్లను ఇంట్లో పెట్టుకోకూడదన్న జ్ఞానం మీ అమ్మకుండాలి – అనే మాట నాలిక చివరి దాకా వచ్చింది. కాని ఎందుకులే అని ఊరుకుంది.

ఇంతలో లైన్‌క్లియర్ గంట కొట్టేరు. అటు తిరిగి చూస్తే ఎప్పుడో విడిపోయిన స్నేహితుడొకడు తన కోసం ఎదురు చూస్తూ ఐదారు గజాల దూరంలో నిల్చున్నాడు. 'హల్లో' అంటూ సుదర్శనం అతనికేసి నడిచాడు.

## 7

ఒకనాడు సాయంకాలం కళాశాల విడిచాక సుదర్శనం ఒక స్నేహితునితో మాటాడుతూ వస్తున్నాడు. మెయిన్‌రోడ్డు జంక్షన్లో చిరపరిచితమైన స్వరం వినిపించింది.

తిరిగి చూస్తే–

శ్రీపతి తన చిన్న గొంతుతో అరుస్తున్నాడు.

"మామయ్యోయ్ మామయ్యా!"

తండ్రీ కొడుకులు రోడ్‌కి అవతల ప్రక్క ఉన్నారు. ఒకసారి కళ్ళు కలిశాక చూడనట్టు ముఖం తిప్పేసుకు వెళ్ళిపోవటం సాధ్యం కాదు. స్నేహితుని దగ్గర శలవు తీసుకొని చిరునవ్వుతో మేనల్లుని ఎదుర్కోవడానికి వెళ్ళాడు.

మామ సమీపించగానే శ్రీపతి అతని రెండు కాళ్ళూ పట్టుకొని కావలిం చేసుకున్నాడు. ఇంటి దగ్గరైతే సుదర్శనం అతణ్ణి ఎత్తుకుని కబుర్లు చెప్పే వాడు. నడిబజారు, పైగా వేసుకున్న బట్టలు నలుగుతాయి. అందుచేత అలానే అల్లుని లేత తనువును తన కాళ్ళకు ఒకసారి అదుముకుని పట్టు విడిపించుకుంటూ అడిగాడు.

"ఎక్కణ్ణుంచండి – ఇలాగ!"

"బదారుకీ – బదారుకీ – బిసకత్తులు కొనుక్కోలానికి వచ్చాం"

శ్రీపతికి మాటలాడ్డం ఒక పెద్ద ఫీటు. అతడిచేత అలా ఫీట్లు చేయించడం సుదర్శనానికి సరదా.

"మరైతే కొన్నావా?"

శ్రీపతి కొన్నానన్నట్టు తలతోపాటు శరీరమంతా ఊపుతూ జవాబిచ్చాడు.

"ఊఁ... ఊఁ... కొన్నాను. యియిగో..." అంటూ జేబుమీద చెయ్యి వేశాడు.

సుదర్శనానికి యింకా తృప్తి కలగలేదు.

"మరి నాకో!"

శ్రీపతి భద్రంగా ఒక బిస్కత్తు ముక్క పైకి తీసి ఇవ్వబోయాడు.

సుదర్శనం శ్రీపతి మారాంను అనుకరిస్తూ అన్నాడు.

"ఊఁ.. ఊ...ఁ నాకది వద్దూ... ఇంతకన్నా మంచిది కావాలీ.. మం...చిది కావాలీ"

అంతకన్నా మంచిదంటే ఏఁవిటో, తను ఇస్తున్నది మంచిదెందుకు కాదో శ్రీపతికి బోధపడలేదు. అందుచేత మామ ముఖంలోకి గుడ్లప్పగించి చూస్తూ తెల్లముఖం వేస్తుంటే తండ్రి అతని సహాయానికి వచ్చాడు.

"అయితే మంచివి కొని యిమ్మనరా! అను – మామా! ఆ మంచివేవో ఒకసారి కొని చూపించూ, యీసారి నుంచీ అలాంటివే పెడుతుంటానూ – అను" అని ఉపదేశమిచ్చాడు.

తండ్రి ఉపదేశం కూడా శ్రీపతికి బోధపడలేదు. తెల్లబోయి చూస్తున్న అల్లుణ్ణి కాళ్ళ కదుముకుంటూ సుదర్శనం నవ్వేశాడు.

తర్వాత అకస్మాత్తుగా సంభాషణ స్తంభించి పోయింది. అవతలి వాళ్ళను ఊహల్లోనే గాని ప్రత్యక్షంగా నొప్పించలేని సుదర్శనం – తనే ముందు మాట కలిపేడు.

"ఇలా ఎక్కణ్ణుంచి?"

ఎందుచేతో మూర్తి సరిగా జవాబివ్వలేదు. ఈ పరాఙ్ముఖత సుదర్శనం మనసుకి చుర్రుమనిపించింది. అది గమనించి మూర్తి సర్దు కున్నాడు.

"ఎక్కడా అగపడ్డం లేదేం?"

దానికేం జవాబు చెప్పాలి? వాళ్ళు మాత్రం కనిపిస్తున్నారా?

సుదర్శనం మొహంలో ఆ ప్రశ్నలు చదివినవాడిలా మూర్తి అన్నాడు.

"సరే. రేపు శనివారం శలవే కదా? అలా ఓసారి రా"

సుదర్శనం మంత్రితుడిలా జవాబిచ్చాడు.

"అలానే"

"ఇల్లు తెలుసు కదూ –కలెక్టరేట్‌కు పడమటి రోడ్డున. పద్మా బిల్డింగ్స్ దాటాక ఆ మలుపులో మొదటి ఇల్లే".

ఇంతలో శ్రీపతి అందుకున్నాడు.

"మామయ్యా! యిప్పులే లా మామయ్యా!"

అప్పుడు కాదనీ ఆ మర్నాడు తప్పక వస్తాడనీ ఆ మాట అబద్ధం కాదు నిజమేననీ శ్రీపతితో నమ్మబలకడానికి ఆ పెద్దవాళ్ళకిద్దరికీ చాలాసేపు పట్టింది. తరువాత వాళ్ళటూ, సుదర్శనం యిటూ అయ్యారు.

సుదర్శనం దారి కడాకూ ఆలోచిస్తూనే ఉన్నాడు – వెళ్ళటమా, మానటమా అని. వెళ్ళకూడదనే ప్రాతిపదికతో ఆలోచిస్తుంటే – అలా మానేయటం తప్పనేందుకు యుక్తులమీద యుక్తులు అతని ముందుకు వస్తూనే ఉన్నాయి.

## 8

అనుకున్ననాడు వెళ్ళలేదు కానీ, ఇంకోనాడు బయలుదేరాడు. ముహూర్తం మిడసరి లగ్నం కావటం వల్ల కలెక్టరాఫీసు రోడ్ కూడా నిర్మానుష్యంగా ఉంది.

ఇల్లు సులువుగానే గుర్తుపట్టగలిగాడు సుదర్శనం. ఇంటి మెట్లెక్కు తుంటేనే ఏదో కాళ్ళకు బంధాలు పడ్డట్టయి కొంతసేపు తటపటా యించాడు. చివరికి ఎలాగైతేనేం తలుపును తట్టగలిగాడు.

లోపలి నుండి "ఎవరూ?" అంటూ కేక వినవచ్చింది. ఆ కేకకి జవాబు యివ్వకుండానే మళ్ళా తట్టాడు.

తలుపు తెరుచుకుంది. కుడిచెయ్యి వెనక్కి దాచుకొని సరస్వతి ఎదురు పడింది.

తనను చూడగానే సరస్వతి గక్కురు మనడం సుదర్శనం గమనించాడు. క్షణకాలం యిద్దరూ అలానే నిలుచున్నాక ఆమె లోనికి తప్పుకుంటూ శ్రీపతిని పిలిచి మామ రాకను తెలియజేసింది.

గజేంద్ర రక్షణకు బయలుదేరిన విష్ణువు సంరంభంలో శ్రీపతి పరిగెత్తుకొచ్చాడు. దిశమొల, మూతి నిండా మెతుకులు, చేతిలో కొబ్బరి కాయతో దర్శనమిచ్చాడు. అల్లుడూ, మావలిద్దరూ నవ్వు చిర్నవ్వులతో పలకరించుకున్నారు. లోనికెళ్ళటమా మానటమా అని సందేహిస్తున్నట్టు సుదర్శనం అక్కడే నిలబడిపోయాడు. తన పొరపాటును గుర్తించి కొట్టుకునే గుండెలతో సరస్వతి అంది –

"లోపలికి రా అన్నయ్యా! అవతల ఉండిపోయావేం?"

సుదర్శనం లోనికి నడిచాడు. కానీ, సరస్వతి మాటా పలుకూ లేకుండా చరచర లోనికి వెళ్ళిపోయింది. శ్రీపతి కూడా ఆమె వెంటే వెళ్ళి పోయాడు.

సుదర్శనానికి ఏం చెయ్యడానికీ తోచలేదు. చడీచప్పుడు లేకుండా వెనక్కి వెళ్ళిపోదామా – అనుకున్నాడు క్షణకాలం. ఇంతలో చేయి చీర చెరగుతో తుడుచుకుంటూ వచ్చిన సరస్వతి మూలకున్న చాపతీసి పరిచింది. వెనకే వచ్చిన కొడుకు వంక తిరిగి అంది.

"నువ్వు భోంచేసి రారా నాన్నా. మామ యిక్కడే ఉంటాడు. నువ్వెళ్ళు"

ప్రశ్నార్థకంగా బుర్రతిప్పుతూ శ్రీపతి మామ నుద్దేశించి అడిగాడు.

"ఉంతావా – మలి?"

ఉండడం ఖాయం అని నమ్మకం కలిగేదాకా ప్రశ్నలు వేసి ఆ తరవాత లోపలికి పరిగెత్తేడు. శ్రీపతి వెళ్ళగానే సుదర్శనం చెల్లెలివంక తిరిగి అడిగేడు.

"నువ్వు కూడా సగంలో లేచినట్టుంది?"

"నా భోజనం అయిపోయింది".

"ఫరవాలేదు. కాకపోతే భోజనం పూర్తిచేసిరా".

ఈ భరోసా గ్రహించి కాస్తసేపు పోయాక అంది.

"సరే. అల్లుడు రానీ వెళ్తాను"

సుదర్శనం ఎవర్నీ దేనికీ బలవంతం చెయ్యడు. మరి కొంతసేపు గడిచాక సరస్వతే అడిగింది.

"దొడ్డమ్మ యిక్కడే ఉందా?"

సుదర్శనం ఆమె వెళ్లిపోయిన విషయం చెప్పాడు.సరస్వతి మరికొంత సేపటి తర్వాత అడిగింది.

"నాన్నగారూ సుబ్బులూ అంతా కులాసాగా ఉన్నారా?"

జవాబిస్తూ, ప్రశ్న యధాలాపంగా అలా వచ్చిందా– ఆలోచించి వేసిందా? అంటూ ఆలోచనలో పడ్డాడు.

"నాన్నగారు ఆమధ్య పదిహేను రోజుల క్రిందట ఒకసారి వచ్చారు. మళ్ళా రాలేదు" అంది సరస్వతి.

ఈ భోగట్టా అతని ఆలోచనలను మరోవంక మళ్లించింది.

సుదర్శనం ఏదో అడగబోతుంటే శ్రీపతి పరిగెత్తుకుంటూ వచ్చి మామ మీద పడబోయాడు. తల్లి తుళ్ళిపడి ఒక్క అంగలో పట్టుకొని కసురుతూ వారించింది. శ్రీపతి బిక్కచచ్చిపోయాడు. తల్లి చీర చెంగుతో అతడి ఒళ్ళు తుడుస్తూ అంది.

"అలా వెళ్ళి మీద పడితే మామయ్య బట్టలు పాడవవూ?"

అంటూ ఒళ్ళంతా తుడిచి అప్పుడు వెళ్ళమంది. అల్లుడు మామ లిద్దరూ ఒకర్నొకరు కౌగలించుకుని కబుర్లలో పడ్డారు. సరస్వతి వంట యింట్లోకెళ్ళింది.

కొంతసేపయాక సుదర్శనం అల్లుణ్ణి ఒళ్ళోంచి లేవనెత్తి మంచినీళ్ళు తెమ్మని పురమాయించాడు.

శ్రీపతి అక్కణ్ణుంచే కేకలు వేస్తూ వెళ్ళి నీళ్ళు తొణకకుండా నెమ్మదిగా అడుగులు వేస్తూ వచ్చి గ్లాసందిస్తూ మహా ఘనకార్యం చేసిన వాడిలా ఆనందించాడు. తరువాత ఏం జ్ఞాపకం వచ్చిందో.

"అమ్మా!... అమ్మ ఎప్పులూ ఏలవలమే మామయ్యా! ఎప్పులూ ఏల వలమే" అన్నాడు.

కళ్ళు రెండూ పెద్దవి చేసి మూతిని వీలైనంత చిన్నది చేసి ఎంతో అభినయంతో తిప్పేడు శ్రీపతి. కాని, ఆ అభినయం మామను ఆకర్షించ లేదు. అతడు పెదవుల ముందుంచుకున్న గ్లాసుతో అలాగే ఉండిపోయాడు. శ్రీపతి ఒక్క క్షణం గమనించే–

"నీల్లు మంచివే మామయ్యా! అమ్మ బిందెలో ముంచిచ్చింది" అన్నాడు నమ్మబలుకుతూ.

ఈ హెచ్చరికతో సుదర్శనం నీళ్ళు తాగేశాడు. గ్లాసు ఎడంగా పెట్టి శ్రీపతిని దగ్గిరకు తీసుకుంటూ.

"ఇప్పుడేదుస్తోందా?" అన్నాడు రహస్యం అడుగుతున్నట్టు.

"ఆఁ.. నన్ను చూలగానే కల్లు తులీచీసుకుంది".

సుదర్శనం యింకే ప్రశ్నా వేయలేదు. విషయం అర్థం చేసుకుంటుంటే సరస్వతి చేతులు తుడుచుకుంటూ వచ్చింది.

ఆమె ముఖం చూడగానే శ్రీపతి మాటల్లోని నిజం కనిపించింది. అన్న తన ముఖంలోకి పట్టి పట్టి చూస్తుంటే ఏదో జ్ఞాపకం వచ్చిన దానిలా సరస్వతి అక్కణ్ణుంచి లోనికెళ్లింది.

ఆమె తిరిగి వచ్చేసరికి సుదర్శనం లేచి నిల్చుని ఉన్నాడు. ఆమె రాగానే వెళ్ళొస్తానంటూ బయలుదేరాడు. సరస్వతి తత్తరపడి మరికొంతసేపు ఉండరాదా అంటూ బలవంతం చెయ్యబోయింది. ఇంకోసారి వస్తానని చెప్పి సుదర్శనం బయలుదేరి పోయాడు.

గుమ్మం దగ్గరకు వచ్చాక సుదర్శనం వెనక్కి తిరిగాడు. సాగనంపు తున్న సరస్వతీ, శ్రీపతీ ఆగారు.

చెల్లెలి ముఖంలోకి పరిశీలనగా చూస్తున్నట్టు నటించి–

"అదేమమ్మా? కళ్ళు ఎర్రగా ఉన్నాయే!" అన్నాడు సుదర్శనం.

సరస్వతి గతుక్కుమని, తరువాత గ్రహించి అంది.

"అబ్బే! ఏం లేదు. ఏమేనా పడిందేమో – ఇందాక పొయ్యూదు తుంటే..."

పాపం! అన్నట్టు తలూపి!

"బొగ్గుల పొయ్యి!" అన్నాడు సుదర్శనం.

సరస్వతి సిగ్గుపడుతూ నవ్వేసింది. సుదర్శనం – పట్టేశాను చూశావా అన్నట్టు చిరునవ్వు నవ్వి "వస్తాను" అంటూ గుమ్మం దిగి పోయాడు.

ఎప్పుడో, వాళ్ళ కుటుంబంలో కలతలు రాక ముందు, ఆ అన్నా చెల్లెళ్ళ మధ్య బోలెడు జోకులు పేలిపోతుండేవి. రోజల్లా ఒకళ్ళనొకళ్ళు ఆటలు పట్టించే వారు. మళ్ళా ఇన్నాళ్ళకి... యీ మాత్రమైనా...?

"మళ్ళా ఎప్పుడొస్తావు?" అంటూ సరస్వతి కేకవేసింది.

"రేపు"

"గోడమీదేనా?" అంది సరస్వతి.

అది పాతజోకు. "అంతే.. అంతే" అన్నట్టు తలూపుతూ వెళ్ళిపోయాడు సుదర్శనం.

## 9

ఇంకో నెల జరిగిపోయింది. అవాళ తండ్రి ఊళ్ళో లేరు.

"ఇవాళ సినీమాకెళ్దామా?" అన్నాడు సుదర్శనం.

అతడికి, ఆడవాళ్ళను వెంటబెట్టుకు ఎక్కడికైనా వెళ్ళడమంటే, అర్థనగ్నంగా వీధిలో తిరగవలసొస్తే ఎంత ఇబ్బందో అంత యిబ్బంది పడతాడు. పైగా అతడు చెప్పిన సినీమాని ఎవర్నడిగినా బాగులేదనే అన్నారు. ఎవరిదాకో అక్కరలేదు. నాలుగు రోజుల క్రితం యీ సుదర్శనమే అన్నాడు – ఎదురు డబ్బిచ్చినా ఎవ్వరూ వెళ్ళరని. అలాంటిది యిప్పుడు ఆ సినీమానే అంటాడేమిటి.

కొంతసేపు వాదించింది. తెగిందాకా లాగకూడదనే పెద్దల వాక్కు జ్ఞాపకం చేసుకొని సరేనంది. తల్లికి ఏ సినీమా అయినా బాధలేదు. ఏదో ఒక సినీమా.

తీరా బయలుదేరే వేళకు అవాంతరం వచ్చి పడింది. తమ పుట్టేదో మునిగి పోతున్నట్టు అకాల మేఘాలు నాలుగు మూలల్నుంచీ కమ్ముకు వచ్చి ఆకాశమంతా అలుముకున్నాయి.

సుబ్బులు గుండెల్లో రాయి పడింది. క్షణ కాలానికీ పెరటి వాకిట్లోకి పోయి ఆకాశం వంక చూడసాగింది. మేఘాలు కూడా సుబ్బులు వంక చూస్తున్నట్లే అనిపించింది. మేం సిద్ధం! మీరు అడుగు బయటకు వెయ్యడమే తరువాయి అంటున్నట్టు ఉన్నాయవి.

అయితే అన్న కూడ తనలాగే ఆత్రపడుతున్నట్టు కనిపించడంతో సుబ్బులు కాస్త ధైర్యంగా ఉంది. ఇంతలో పెరటి వాకిట్లోకి వచ్చిన తల్లి మేఘాల వంక చూస్తూ.

"మేఘాలేమిట్రా – ఇలా ముసురు కుంటున్నాయా?" అంటూ అప్పటికే అన్ని ముస్తాబులు అయివున్న పిల్లలకేసి చూసింది.

ఆ మేఘాలు ఉత్తుత్త మేఘాలే అనీ, ఆర్భాటమేగాని కురిసేవి కావనీ చిన్నపిల్లల్ని మాయచేసినట్టు మాయచేయబోయారు. ఎంతసేపు ఆమె వినలేదు. చివరకు సుదర్శనం కోపం తెచ్చుకొని కసురుకున్నాడు – అప్పటికి.

"పోనీ నీకెందుకంత కోపం. వస్తానులేరా" అన్నారు పార్వతమ్మ గారు.

సుదర్శనం అన్నట్టే ఆ మేఘాలు కాస్త సేపటికి తేలిపోయాయి.

హాలు దగ్గరకు నడుచుకునే వెళ్ళారు. వాళ్ళిద్దర్నీ ఒక దగ్గర నిలబడమని సుదర్శనం యెటో వెళ్ళిపోయాడు.

పావుగంట తరవాత ఆదరా బాదరాగా వాళ్ళ దగ్గరకొచ్చి టిక్కెట్లిచ్చాడు. ఎవరో స్నేహితుడట. ఎంతకీ వదలడట. ఎలాగో వదిలించుకొని వచ్చేడట. సుదర్శనం తను చెప్పుకు పోవడమేగాని అంత వివరంగా చెప్పవలసిన అవసరం ఉందో లేదో గమనించడం లేదు.

తల్లీకూతుళ్ళు హాల్లోకి వెళ్ళేసరికి లైట్లు ఆరిపోయాయి. ఆట అప్పుడే ఆరంభమౌతోంది. ఆ చీకట్లోనే తడుముకుంటూ వెళ్ళి ఒకచోట కూర్చున్నారు.

కొండవీటి చాంతాళ్ళను పోలే పాటలతోనూ సమయం సందర్భం లేని కామిక్ ఉపఖ్యానాలతోనూ కథ చాలా పెద్దది.

చివరకు ఎలాగైతేనేం ఇంటర్వల్ ఇచ్చారు.

పార్వతమ్మ గారు అప్పటికప్పుడే పరిచయం చేసుకున్న పొరుగమ్మతో కబుర్లారంభించారు. ఆ అమ్మకు ఎంత మంది పిల్లలో, మొగుడికి ఏం ఉద్యోగమో, జీతమెంతో, పై సంపాదన ఎంతో యీవిడ అడగడానికీ జంకడం లేదు. ఆవిడకు చెప్పడానికీ అనుమానించడం లేదు.

సుబ్బులు ఇంకా చిన్నపిల్ల. అందుచేత కూచున్న స్థలం ఏదో యిబ్బంది పెడుతున్నట్టు ఏదో గొడవకు తుళ్ళిపడ్డట్టు ఉన్నపాటున లేస్తూ చప్న వెనక్కి తిరిగి చూస్తూ మధ్య మధ్య పైట సవరించుకుంటూ యధాలాపంగా చూసినట్టు హాలు నాలుగువైపులా కలయచూస్తోంది.

ఒకసారి అలా చూస్తూ చూస్తూనే అలానే ఉండిపోయింది. గేటు దగ్గర భుజాన నిద్రిస్తున్న శ్రీపతితో సరస్వతి నిల్చుని ఉంది. ఆమె కళ్ళు తల్లి వంకే ఉన్నాయి. ఒకసారి చలించటంలో సుబ్బులు చూపులతో కలిసేయి. ఇద్దరూ ఒకర్నొకరు చూసుకున్నారు. అలా చూస్తూనే సరస్వతి కుడిచేతి చూపుడు వేలుని ఒకసారి ముక్కు మీదుంచుకొని చేయి అడ్డంగా ఊపింది. సుబ్బులు గ్రహించినట్టు ప్రతి సైగ చేసింది. కూర్చోమని తన వంక చూడవద్దనీ సరస్వతి సైగ చేసింది. సుబ్బులు కూర్చుండి పోయింది. కాని వెంటనే ఆమె ఆలోచనలు అన్న మీదికీ, ఆ సాయంత్రమల్లా సాగిన అతని విచిత్ర ప్రవర్తన మీదకీ సాగిపోయాయి.

ఇంతలో దీపాలారి ఆట మళ్ళా మొదలెట్టేశారు.

ఇంటికి వచ్చాక తల్లి, నూతి దగ్గర కాళ్ళూ చేతులూ కడుగుతూ ఉంటే సుబ్బులు యివతలి గదిలో బట్టలు మారుస్తున్న అన్న దగ్గరికి వెళ్ళి–

"నాకు తెలిసిందిలే" అంది గుట్టు పట్టుకున్న దానిలా,

సుదర్శనం గతుక్కుమన్నాడు. అతడు అప్పుడప్పుడే పాంటు జేబులోని సిగరెట్ పెట్టెతీసి సూట్‌కేసులో భద్రపరుస్తున్నాడు. అయినా దబాయించేడు.

"ఏమిటి తెలుసు?"

"నువ్వు అక్కయ్య గారింటికి వెళ్తున్నావు కదూ?"

సుదర్శనం గుండెలు తేలికపడ్డాయి. అందుచేత నెమ్మదిమీద జవాబిచ్చాడు.

"ఎవరన్నారు?"

"ఎవరనాలేమిటి? ఎన్నడూ లేంది బలవంతంచేసి మరీ – ఆడవాళ్ళను సినీమాకి తీసికెళ్ళడం... ఆవిడగారు కూడా సరిగ్గా ఆ ఆటకే రావడం..."

సుదర్శనం మధ్యలోనే అడిగాడు.

"అమ్మ చూసిందా?"

"లేదులే. కాని నేను చెప్తాను".

"చెప్పుకో" నిబ్బరంగా అన్నాడు. కాని ఆ నిబ్బరం అరక్షణమైనా నిలవలేదు. ఇంట్లోకి వస్తున్న తల్లి మట్టెల చప్పుడు వినిపిస్తోంది. సుదర్శనం గొంతు తగ్గించి అన్నాడు –

"వస్తోంది. జాగ్రత్త. పిచ్చి పిచ్చి వేషాలెయ్యకు".

తరువాతంతా గప్‌చుప్. తల్లి వచ్చేసరికి సుబ్బులు కూడా పాగా కొయ్యనున్న బట్టలే ఊడదీసి యీ కొయ్యకాదని ఆ కొయ్యను పెడుతోంది.

కాని యీ విధమైన మోసం ఎంతోకాలం సాగలేదు. కనీసం కొన్ని సార్లయినా అసిపోలేదు. రెండోసారి యిలాగే సినీమాకి తీసికెళ్ళితే అప్పుడే బయటపడి పోయింది.

ఈసారి యింటర్వల్ సరికి శ్రీపతి నిద్రపోలేదు. వాడు అమ్మమ్మ సగం నెరిసిన జుట్టునీ, చక్కిలం చుట్ట చుట్టుకొనే ఆమె జడనీ ఎంతదూరం నుంచైనా పోల్చగలడు. పది బెంచీల ముందు కూర్చున్న అమ్మమ్మను పోల్చుకోగానే తల్లి ముఖం బలవంతాన తనవైపు తిప్పుకొని వేలితో అమ్మమ్మని చూపిస్తూ, అమ్మమ్మాయ్! అమ్మమ్మా!! అంటూ ఒళ్ళోంచి జారి పోతున్నాడు. సరస్వతి రాబోయే ప్రమాదాన్ని ఆకస్మికంగా గుర్తించడం వల్ల గాభరా పడిపోతూ ఒక చేత్తో పిల్లవాడి రెక్క పట్టుకొని ఆపుతూ చేత్తో వాడి నోరు మూస్తూ అదిమి పట్టుకొంది.

సరిగా యీ స్థితిలోనే అమ్మమ్మ వెనక్కు తిరిగి చూసింది. ఆమె చూసినట్టు సరస్వతి గమనించలేదు. పిల్లణ్ణి సముదాయించి ముందుకు చూసేలోగా పార్వతమ్మగారు తల తిప్పేశారు. ఆ తరువాత లైట్లు ఆరిపోయాయి.

ఆట వదిలాక సుబ్బులు అన్న కోసం ఎదురు చూస్తోంది.

"వాడే వస్తాడు పద" అన్నారు పార్వతమ్మ గారు.

ఇద్దరూ మెయిన్ రోడ్ మీదకు వచ్చారు. పది గజాల వెనక సుదర్శనం గొంతు వినిపించింది.

"మీరు వెళ్ళండి" అంటున్నాడు ఎవరితోనో, సుబ్బులు తల తిప్పి ఏమి చూసిందో పార్వతమ్మ చూడకుండానే అది గ్రహించింది.

"మీరు ముందొచ్చేశారా, మీ కోసం చూస్తున్నాను" అంటూ సుదర్శనం వాళ్ళను కలిసేడు. పార్వతమ్మ గారు అప్పుడు మాటాడలేదు. మెయిన్‌రోడ్ విడిచి వాళ్ళ సందులోకి మళ్ళనిచ్చి ఆరంభించారు.

"...మనుష్యులకు ఒకర్ని చూశాకయినా బుద్ధిరావాలి. సిగ్గూ, లజ్జా, బిడియం, పౌరుషం లేని జన్మ ఏం జన్మ. ఎన్నేళ్ళొస్తే ఎందుకు ఛీ!" అంది మొదట.

తరవాత–

"...యేం? దాని కొడుకు నది మాటాడనిచ్చిందా! నోరు అడ్డంగా నొక్కేసిందే! చేయి పట్టుకొని గుంజేసిందే! వేలెడు వెధవ అయితే అగుగాక! తల్లి ఇంగితం తెలుసుకున్న వాడు! తరవాత మళ్ళా అమ్మమ్మా అన గలిగాడా? నాకూ ఉన్నాయి ఏళ్ళు. ఇంగితజ్ఞానం లేకపోయాక ఎన్నేళ్ళొస్తే ఎందుకు? అందుకే అన్నారు. మంచి పశువుకొక దెబ్బా మంచి మనిషికొక మాటా..."

ఇంతలో ఇంటికొచ్చేశారు. సుదర్శనం ఒక్క అంగలో తలుపు దబదబ బాదాడు. తండ్రి జవాబు కూడా వెంటనే రావడంతో సుదర్శనం బతికి పోయాడు.

## 10

మర్నాడల్లా సుదర్శనం తల్లిని తప్పించుకుంటూ తిరిగాడు. సాయంకాలం ఇంటికి వచ్చేసరికి తల్లి ఎవరింటికో వెళ్ళే సన్నాహంలో ఉంది. ఆమె అటు వెళ్ళగానే పెరట్లో వంట పని చూస్తున్న సుబ్బులు దగ్గరకెళ్ళి కూర్చున్నాడు.

"ఏమిటంటుందే అమ్మా?"

సిబ్బి అడుగు భాగం శుభ్రంగా తుడిచి పొయ్యిమీద ఎసరుకి మూతపెడుతూ అంది.

"అమ్మకు నీ మీద మహా కోపంగా ఉంది"

"ఉండనీ"

ఒక నిమిషం వరకూ ఎవరూ మాటాడలేదు. తర్వాత సుబ్బులు అంది.

"ఇదంతా ఆ సిసింద్రీ వెధవ నుంచి వచ్చింది"

"అన్నట్టు అడుగుదామనుకుంటూ మరచిపోతున్నాను. అమ్మకు ఎలా తెలిసిందీ?"

సుబ్బులు చెప్పింది. సుదర్శనం అంతా విని–

"ప్చ్! చిన్న పిల్లల్తో ఉండే చిక్కే యిది. వాళ్ళకు ఎప్పుడు మాట్లాడాలో తెలియదు. ఎప్పుడు మాటాడకూడదో తెలియదు. ఏది చెప్పాలో తెలియదు, ఏది చెప్పకూడదో తెలియదు. ఏది చూస్తే దాని గురించి ఎలా కనిపిస్తే అలా వాగేస్తుంటారు. అవాళా అలాగే–" అంటూ ఆగిపోయాడు.

ఒక్క క్షణం ఊరుకొని ఆవాళ ఏమయ్యిందని అడిగింది సుబ్బులు.

మంచినీళ్ళు తెచ్చి యిస్తూ తల్లి ఏడుపు గురించి శ్రీపతి తనతో చెప్పిన మాటలు చెప్పి–

"అవాళ అలా వాగడం వల్ల మంచే అయ్యిందనుకో, నిన్న మాత్రం కొంపలు ముంచాడు!" అన్నాడు సుదర్శనం.

కొంతసేపు ఊరుకొని సుబ్బులంది–

"ఏమో! ఇవాళ నేను కూడా వాడిలాగే కోతి పని ఒకటి చేశాను" అంది సుబ్బులు.

"నువ్వేం చేశావు?"

"మధ్యాహ్నం భోజనాల దగ్గర ఏదో మాట మీద మాట వచ్చి అమ్మ అందుకుంది! మనందరం ఒక్క ఆవంలోంచి వచ్చిన కుండలమేనట. నాన్న గారేమో వాళ్ళకు వత్తాసిచ్చి వాళ్ళ చేత వేరింటి కాపురం తనే పెట్టించారట. చాలని కాడికి డబ్బులు కూడా పెడుతున్నారట. ఆ మాటకొస్తే ఆయనే నయమట. చాటుమాటు వ్యవహారాలు ఆయనకు చాతకావట. నువ్వలా కాదట. నీదంతా చాపకింద నీరులా జరిగి పోతుందట. మునిగిందాకా ఏమయ్యిందో తెలియనీయవట. ఇప్పుడే కాదు చిన్నప్పణ్ణుంచీ నీ పద్ధతే అంతట. అక్క దాని దొంగ విద్యలన్నీ నీ దగ్గరే నేర్చుకుందట. ఆదినుండీ వీరిద్దరూ తోడి దొంగలేనట. మూగి మూశానమ్మల్లా ఉంటూనే కొంపలు ముంచుతారట. ఇంకా నా గురించి. నాకింకా తరిఫీదు పూర్తవలేదట. అయితే నేనూ అక్కడికే తేల్తానట.

ఇలా అంటూ తనకి తోడూ నీడా లేరు కాబట్టి తాను ఒంటరై పోయానని కళ్ళనీళ్ళు పెట్టుకుంది.

"చెప్పకేం – ఆ దెబ్బతో ఏమైతే అదే అయ్యిందని, ఉన్నదున్నట్టూ అంతా చెప్పేశాను".

సుదర్శనం నిలువు గుడ్లేసి చూస్తూ–

"అంటే?"

"బావగారు రోడ్డుమీద కలిసి పిలవడం, నిన్ను గదిలో కూచోబెట్టి అక్క వంటింట్లో ఏడుస్తూ కూర్చోవడం, ఆ తరవాత అప్పుడప్పుడూ అటువెళ్ళినా వాళ్ళింట్లో ఏమీ తీసుకోకపోవటం, ఆవాళ అక్కయ్యకు కల రావటం, రోజల్లా ఏడుస్తూ కూచుంటే సాయంకాలం బావగారు నిన్ను కాలేజీ దగ్గర పట్టుకుని ఇంటికి తీసికెళ్ళడం, సినీమా నెపంతో హాలుకి తీసుకెళ్ళి అక్కడ అమ్మని చూపించటం – ఒకటిగాదు. పూస గుచ్చినట్లు వరసాగ్గా అన్నీచెప్పేశాను".

"చివరికేమిటయ్యింది?"

"చెప్పినదంతా మాటాడకుండా వింది. తరవాత చెయ్యి కడిగేసుకొని అలా ఆ కంచం దగ్గరే గోడకు చారబడిపోయింది. నేను కంచాలు కడుక్కు వచ్చేసరికి ఊ... ఏడుస్తోంది. ఎందుకమ్మా అంటే మాటాడదు. ఊరుకోమన్నకొద్దీ ఏడుపు ఎక్కువై పోతోంది. నాకేం చెయ్యడానికీ తోచదు. అక్కడుండలేను – విడిచి వెళ్ళలేను. ఇంతలో ఎదురింటి కామేశ్వరమ్మ గారొచ్చి అదేపనిగా వీధి తలుపు బాదుతున్నారు. వెళ్లి – వాళ్ళబ్బాయికీ నీకూ ఏవో పరీక్షలున్నాయి కాబట్టి మీరు భోజనాలకింటికి రారని చెప్పి, ఆమె చెప్పిన సోదంతా విని, వంటింట్లోకి వస్తే అప్పటికి ఏడుపాపేసి పడుకుని ఉంది".

"మంచి పని చేసేవ్!" అన్నాడు సుదర్శనం. అన్నాడు కాని ఆలోచనలో పడ్డాడు.

"మంచో చెడ్డో, ఆ గొడవలో అలా చెప్పవలసి వచ్చింది చెప్పేశాను. మంచి జరిగితే జరుగుతుంది. చెడు జరిగితే జరిగిందనడానికి మించి యింక జరిగేది లేదు" అంది సుబ్బులు.

ఇంతలో వీధి తలుపు తెరిచిన చప్పుడయింది. తల్లి వస్తూనే–

''ఎవరో అబ్బాయి నీ కోసరం అవతల నిలుచున్నాడయ్యా!" అంది సుదర్శనంతో.

సుదర్శనం లేచి బయటికి వెళ్ళిపోయాడు.

## 11

పదిరోజులు గడిచాయి. ఈ పదిరోజుల్లోనూ తల్లి వైనాలు పది విధాలుగా చెప్పింది సుబ్బులు – అన్నతో.

ఒకరోజు తండ్రిమీద దండయాత్రలు. పెళ్ళయినది లగాయతూ నాటివరకూ ఆయన ఎప్పుడెప్పుడు యేయే సందర్భాల్లో ఎన్నెన్ని విధాల తన మనసు కష్టపెట్టారో ఆ భోగట్టాలన్నీ చెప్పుకు వచ్చిందట. అవన్నీ ఇప్పుడెందుకమ్మా అంటే – కాదు ఏదో జ్ఞాపకం వచ్చి చెబుతున్నానంటుందట.

ఇంకోనాడు సుదర్శనం, సరస్వతీ చిన్నప్పటి కొట్లాటల గురించి, ఇద్దర్నీ సంబాళించలేక తను సతమతమవటం గురించి.

మరోనాడు ఆమె జబ్బు గురించి. తను జబ్బుపడిపోవటం, టెలిగ్రాం యిస్తే వారం రోజులుగ్గాని తోటికోడలు రాకపోవడం, వచ్చేకైనా ఇంట్లో ఉన్నది కనక వండి పడెయ్యడం తప్ప రోగికి ఒక నీళ్ళనిగాని ఒక పాలని గాని

పట్టించుకోక పోవడం. ఆడపనికీ మగపనికీ అటు ఆసుపత్రికి తిరగడానికీ ఇటు ఇల్లు సంబాళించుకోడానికీ అన్నిటికీ ఒంటరిగా ఆ భర్తే సాగిరావడం, అప్పట్లో చిన్నదైనా సరస్వతే నల్లికి నరంలా సాగి యిటు తనకు సేవలు చేస్తూనే అటు తండ్రి మంచాన పడకుండా ఆయన్ని సాకడం – ఆ కథలన్నీ చెప్పింది.

ఇంకోనాడు అక్క పెద్దమనిషవడం, ఆ తరవాత దానికి సంబంధాలు వెదకడం, వాళ్ళ కుటుంబంలో అందరూ తిక్కవాళ్ళే వద్దు వద్దంటున్నా తన మాట లక్ష్య పెట్టకుండా యీ అల్లుడు మహానుభావుడికి కట్టబెట్టడం పెళ్ళయిన మర్నాటి నుంచే ఆయన యేకు మేకైపోవడం – అవన్నీ చెప్పిందట.

ఇలా రోజూ ఏవేవో పాత విషయాలు వల్లిస్తూ వుంటే వినలేక తన చెవులు గళ్ళువేసి పోతున్నాయంటుంది సుబ్బులు.

సుదర్శనం చిన్నప్పుడెప్పుడో ఓ పద్యం చదువుకున్నాడు. ఇనుము విరిగితే రెండు మూడుసార్లు కాల్చి అతికీ వచ్చుట. మనసు విరిగితే మాత్రం మళ్ళా అతుక్కోవడం కష్టం అన్నాడు – ఆ పద్యం రాసిన వేమన గారు.

ఆయన ఎందుకలా అన్నాడో తెలియదు. ఈయన మాత్రం ఆ సూక్తిని అక్షరాలా నమ్మేశాడు – ఇంతకాలం.

ఈ పది రోజులయీ తల్లి చెబుతూ వచ్చిన 'సోదుల' గురించి వింటూ ఉంటే ఒక విషయం తెలుస్తోంది! ఆ సోదులన్నీ ఎక్కడ ఆరంభమైనా, దేని గురించి సాగినా ఎవరి గురించి సాగినా పర్యవసానంలో అది సరస్వతి దగ్గరకో, ఆమె భర్త దగ్గరకో వచ్చి ఆగేవి.

అతడికి తెలిసిన మేరకు తల్లి పార్వతమ్మ మహా పట్టుదల మనిషి, ఆమెది రాతిగుండె. కోపం వచ్చి ఎవరితోనైనా మాటలు మానేస్తే రోజుల తరబడి వారాల తరబడి ఒక్కో అప్పుడు నెలల తరబడి ఆ శిక్ష అలా సాగవలసిందే. శిక్షాకాలంలో శిక్షితులు ముట్టిన వస్తువునైనా ముట్టేది కాదు. వాళ్ళున్న చోట తను ఉండడానికైనా ఒప్పేది కాదు. వాళ్ళ ప్రస్తావన తను తెచ్చేది కాదు. ఇంకొకరు తెస్తే అక్కణ్ణుంచి లేచిపోయేది.

అలాంటిది ఆమె – ఇప్పుడిదంతా వింటే – ఆమెలో ఘర్షణలేమిటో వాటిని ఎలా అర్థం చేసుకోవాలో సుదర్శనానికి తెలియడం లేదు.

ఆ సాయంకాలం తల్లి ఇంట్లో లేదు, అన్నాచెల్లెలూ పెరటి వాకిటిలో తల్లి గురించే మాట్లాడుకుంటున్నారు. ఇంతలో వీధి తలుపు దబదబ చప్పుడయ్యింది.

''వచ్చే'' అంటూ సుబ్బులు తలుపు తీయడానికి బయలుదేరింది. ఆమె కంఠం వినగానే ఓ చిన్న కంఠం అరుస్తోంది.

"పిన్నోయ్! చుబ్బుపిన్నీ! నేనొత్తాను!! ఇదిగో నేనొత్తాను"

సుబ్బులు సంతోషంతో రెండంగల్లో వెళ్ళి తలుపు తీసింది. సుదర్శనం కూడా ఆ వెంటే వెళ్లాడు.

పినతల్లీ కొడుకూ ఒకరి మెడ ఒకరు గట్టిగా కౌగలించేసుకున్నారు. పార్వతమ్మగారు వాళ్ళను తప్పుకొని లోనికి వెళ్లారు.

సుదర్శనాన్ని చూడగానే అల్లుడు, మామవంక తిరిగి కలాని కందని స్వరంతోనూ సంతోషంతోనూ

"మామయ్యోయ్..." అన్నాడు.

మామకూడా అల్లుడి స్వరాన్ని పోజునూ అనుకరిస్తూ

"ఓ..హో" అని పలకరించాడు.

అల్లుడు ఒక నవ్వు నవ్వాడు. మామ బదులిచ్చాడు.

తర్వాత వరండాలోకి వెళ్లి వీధిలోకి అటూ ఇటూ చూసి ఇంకెవ్వరూ కనిపించక పోగా–

"ఒక్కడూ ఎలా వచ్చాడూ?" అంటూ సుదర్శనం చెల్లెలి వెంట లోనికెళ్లాడు.

"ఎక్కడ దొరికాడీ పెంకె నాన్న!" అంటూ సుబ్బులు తల్లిని అడిగింది. పార్వతమ్మగారు మొఖం పక్కకు తప్పించేస్తూ–

"ఏమో, వెధవ! కనకమహాలక్ష్మికి కొబ్బరికాయ కొట్టి ఇవతలకు వస్తుంటే వెనక నుంచే వచ్చి కాళ్ళు రెండూ కావలించుకున్నాడు. ఎవరా అని తిరిగి చూస్తే – వీడూ! తర్వాత నీతో వస్తాను. నీతో వస్తాను అంటూ వదలడూ! వాడలా అంటే ఇంకేం చేస్తాను? సరే అని తీసుకొచ్చేశాను".

సరస్వతి సంగతి వాళ్ళడగలేదు. ఆమె చెప్పనూలేదు. అన్నాచెల్లెలు మాత్రం ముఖముఖాలు చూసుకున్నారు.

పార్వతమ్మగారు పెరట్లోకి వెళ్లిపోయిన తర్వాత సుబ్బులు గొంతు తగ్గించి అడిగింది.

"ఎవరెవరు వచ్చార్రా బాబూ!"

"అమ్మ! నాన్నగాలూ! పొలుగు చాంత పిన్నీ! అంతా వచ్చాలు..."

"అమ్మతో చెప్పావా? – నువ్వు యిలా వస్తున్నావని"

"ఆఁ... చెప్పాను. నేనల్లక్కడ అమ్మమ్మను చూచి పలుగెత్తుకెళ్ళాను. మేమిద్దలం వచ్చేత్తున్నాం. అమ్మ కొబ్బరికాయలు కొంతోంది. నేనెల్తున్నా అని చెప్పేను. అమ్మ... అమ్మ... అమ్మ... ఊలుకుంది. అలా.. చూత్తూ ఊలుకుంది".

చాలా చాలా అభినయంతో, బహుకష్టంమీద అన్నీ

జ్ఞాపకం తెచ్చుకొని ఎంతో శ్రమపడి చెప్పాడు.

అన్నా చెల్లెళ్ళిద్దరూ మరోసారి మొహాలు చూసుకున్నారు. తరవాత సుదర్శనం అడిగాడు.

"నాన్నగారేమీ అనలేదూ?"

"నాన్నగాలా?... నాన్నగాలూ... నాన్నగాలు ఏమీ అనలేదు. అమ్మమ్మా... అల్లక్కలున్నప్పులు... అమ్మమ్మను చూపించీ... నాన్నగాలే వెల్లమన్నాలు".

ఆ తరవాత అడగటానికి వాళ్ళకింక ప్రశ్నలు లేవు.

## 12

రాత్రి భోజనాలవుతున్నాయి. శ్రీపతి పొద్దుపోగానే తినేశాడు. అందుచేత తాతగారి ప్రక్కనే వేరే పీటమీద కూర్చుని కబుర్లు చెపుతున్నాడు. కొంతసేపైన తర్వాత ఏం బుద్ధిపుట్టిందో లేచి "నే పలుకుంతాను" అన్నాడు ముఖం అదోలా పెట్టి.

మామ వర్జ్యముందని చెప్పి పిల్లవాణ్ణి బెదిరించబోయాడు. శ్రీపతికి ఆ జోకు అర్థం కాలేదు. వినిపించుకోకుండా వెళ్లిపోయాడు.

సుదర్శనం భోజనం ముందయిపోయింది. ఇవతలకు వస్తే చీకటిగా ఉన్న నట్టింటిలోంచి శ్రీపతి గొంతు నెమ్మదిగా వినిపిస్తోంది.

''ఆఁ లోజూ ఏలిచీది. నాన్నగాలూ అమ్మను దెబ్బలాలీవాలు".

తరవాత పార్వతమ్మగారు ఏదో ప్రశ్న వేసి ఉంటారు. దానికి జవాబు శ్రీపతి కాస్త గట్టిగా చెబుతున్నాడు.

"ఆఁ నేనలాగంతే, అమ్మమ్మొత్తుందీ.. తీతుకెల్తుందీ.. అనీది".

తరవాత అమ్మమ్మ మందలించింది కాబోలు – మెల్లిగా చెప్పసాగాడు.

"... ఎప్పులంతే, లోజూ లేపే అనీది. తాతయ్యా... తాతయ్యా... అప్పులొకసాలీ.. అల్లప్పు లొకసాలీ.. మల్లా అతలప్పు లొకసాలీ... వచ్చాలు. తాతయ్యా అన్నీ అబద్ధాలే అమ్మమ్మా! నువ్వాల్లో లేవన్నాలు. ఉన్నావు కదమ్మమ్మా?"

అమ్మమ్మ ఏం జవాబు చెప్పిందో వినిపించలేదు. శ్రీపతి హుంకరించి చెప్పసాగాడు.

"హుఁ! అబద్ధాలే.. అన్నీ అబద్ధాలే!..."

ఇంకా పొంచి వినడానికి సుదర్శనానికి సిగ్గేసింది. అతడు లోపలికి వెళ్ళేసరికి శ్రీపతి ఆగిపోయాడు.

గది దాటి అవతలి గదిలో బట్టలు మారుస్తుంటే శ్రీపతి మళ్ళా గుసగుస లాడుతున్నాడు.

"నేను నీ దగ్గిలే పలుకుంతా నమ్మమ్మా! పిన్ని దగ్గిల పలుకోను.

అమ్మ దగ్గిల పలుకుంతే... అమ్మ మంచిది కాదమ్మమ్మా! చగం లాతిల్లో చూత్తే నా దగ్గిలుంద దమ్మమ్మా! నాకు తెలివొత్తుందీ.. చూత్తే అమ్ముండదమ్మమ్మా! చీకతీ! బయ్యం! అప్పులూ అమ్మా.. అమ్మా.. అని పిలిత్తే – పలుకో పలుకో అంతూ వత్తుంది. నాకు చీకతీ బయ్యం..."

తర్వాత గుస గుస లాగిపోయాయి.

సుదర్శనం బట్టలు మార్చి నడవలో దీపం తీసుకెళ్ళి నట్టింటి మధ్యగా ఉంచాడు. వెలుతురు నిండిన గదిలో తల్లి – క్రీనీడలో ఉన్నా శ్రీపతి కళ్ళు మెరుస్తున్నాయి. తల్లి గోడ కభిముఖంగా ఉండడం వల్ల ఆమె ముఖం కనబడలేదు. ★

*(భారతి: సెప్టెంబర్, అక్టోబర్ 1949)*